# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 21-12-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 114 | పేజీలు:4 | వెల: రూ.1/-


## మోడెర్నా బూస్టర్ డోసుతో యాంటీబాడీల వృద్ధి!

న్యూయార్క్, డిసెంబర్ 20: : కొవిడ్-19 తాజా వేరియంట్ ఒమిక్రాన్‌ను సమర్ధంగా ఎదుర్కొనేలా తమ బూస్టర్ వ్యాక్సిన్ యాంటీబాడీ లెవెల్స్‌ను గణనీయంగా పెంచుతుందని బయోటెక్నాలజీ కంపెనీ మోడెర్నా వెల్లడించింది. బూస్టర్ డోసులకు ముందున్న యాంటీబాడీలతో పోలిస్తే 50 మైక్రోగ్రాముల బూస్టర్‌తో యాంటీబాడీలను 37 రెట్లు పెంచుతాయని, 100 మైక్రోగ్రాముల బూస్టర్‌తో యాంటీబాడీలు ఏకంగా 83 రెట్లు పెరుగుతాయని వెల్లడించింది.

ప్రపంచవ్యాప్తంగా ఒమిక్రాన్ కేసులు పెరుగుతుండటం కలవరపరుస్తోందని, తమ బూస్టర్ డోసులతో యాంటీబాడీల లెవెల్స్ అనూహ్యంగా పెరుగుతాయని వెల్లడవడం భరోసా ఇస్తోందని మోడెర్నా సీఈఓ స్టీఫెన్ బన్సెల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బూస్టర్ వ్యాక్సిన్ 100 మైక్రోగ్రామ్ డోస్ సురక్షితమైనదని, ఎలాంటి ముఖ్యమైన సైడ్ఎఫెక్ట్స్ తలెత్తలేదని రెండో దశ అధ్యయనంలో తేలిందని చెప్పారు.

గత ఏడాది నవంబర్‌లో ఫేజ్ 3 క్లినికల్ ట్రయల్స్‌లో తమ వ్యాక్సిన్ సామర్ధ్యం రేటు 94.1 శాతంగా ఉందని మోడెర్నా ప్రకటించింది. ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీపై నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ భాగస్వామ్యంతో కొవిడ్-19 వ్యాక్సిన్‌ను మోడెర్నా అభివృద్ధి చేసింది.

# ఓటరు కార్డుతో ఆధార్ లింక్.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం



న్యూఢిల్లీ, డిసెంబర్ 20:ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానికి సంబంధించిన బిల్లుకు లోక్‌సభలో ఆమోదం దక్కింది. ఎన్నికల చట్టాల సవరణ బిల్లు 2021.. మూజువాణి ఓటు ద్వారా క్లియరెన్స్ పొందింది. అయితే ఇవాళ మధ్యాహ్నంఒ స్వల్ప చర్చ తర్వాత ఎన్నికల చట్టాల సవరణ బిల్లుకు ఆమోదం దక్కింది. ఈ బిల్లు ఆమోదంతో ఇప్పుడు ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం తప్పనిసరి అయ్యింది. ఇక నుంచి ఓటు రిజిస్టర్ చేసుకోవాలనుకునే వారి నుంచి ఎన్నికల రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు ఆధార్ నెంబర్‌ను తీసుకుంటారు. ఐడెంటిటీ గుర్తించేందుకు ఇది అవసరం అవుతుందని మంత్రి రిజిజు తెలిపారు. మూజు వాణి ఓటు ద్వారా బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఇవాళ ఉదయం ఎన్నికల చట్టాల సవరణ 2021 బిల్లును మంత్రి రిజిజు ప్రవేశపెట్టారు. ఆ బిల్లును విపక్షాలు వ్యతిరేకించాయి.

ఓటరు కార్డుతో ఆధార్‌ను లింక్ చేయాలన్న ఉద్దేశంతో ఎన్నికల చట్టాల సవరణ బిల్లును కేంద్రం తీసుకువచ్చింది. లోక్‌సభలో ఈ బిల్లును విపక్షాలు వ్యతిరేకించాయి. బోగస్ ఓటింగ్, నకిలీ ఓటింగ్‌ను నిర్మూలించాలంటే ఈ బిల్లుకు ఆమోదం తప్పదని మంత్రి రిజిజు తెలిపారు.

ఆధార్ చట్టం ప్రకారం ఆధార్‌ను ఓటర్ కార్డుతో అనుసంధానం చేయరాదు అని కాంగ్రెస్ నేత మనీష్ తివారీ అన్నారు. ఎన్నికల చట్టాల సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు. విపక్ష నేతలు అసదుద్దీన్ ఓవైసీ, శశిథరూర్ కూడా ఈ బిల్లును వ్యతిరేకించారు. ఆధార్‌ను కేవలం అడ్రస్ ప్రూఫ్‌గా వాడారని, కానీ అది పౌరసత్వ ధ్రువీకరణ పత్రం కాదు అని శశిథరూర్ అన్నారు. ఓటర్లను ఆధార్ అడిగితే, అప్పుడు కేవలం అడ్రస్ డాక్యుమెంట్ మాత్రమే వస్తుందని, అంటే పౌరులు కాని వారికి మీరు ఓటు వేసే హక్కు కల్పిస్తున్నట్లు అవుతుందని ఎంపీ శశిథరూర్ ఆరోపించారు. ఎన్నికల చట్టాల సవరణ బిల్లును స్టాండింగ్ కమిటీకి సిఫారసు చేయాలని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి తెలిపారు.

## బ్రిటన్‌లో 12కు చేరిన ఒమిక్రాన్ మరణాలు

లండన్, డిసెంబర్ 20:: బ్రిటన్‌లో ఒమిక్రాన్ మరణాలు 12కు చేరాయి. ఆ దేశ డిప్యూటీ ప్రధాని డొమినిక్ రాబ్ సోమవారం ఈ విషయాన్ని తెలిపారు. కొత్త కరోనా వేరియంట్ బారిన పడిన 104 మంది ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో క్రిస్మస్‌కు ముందు సామాజిక ఆంక్షలను కఠినతరం చేయడాన్ని తోసిపుచ్చేందుకు ఆయన నిరాకరించారు. కాగా, బ్రిటన్‌లో ఒమిక్రాన్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ఒమిక్రాన్ పాజిటివ్ రోగులు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. దీంతో వైద్య వ్యవస్థలపై భారం పడే ప్రమాదమున్నదని ఆ దేశ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మరోవైపు ప్రజలపై ఆంక్షలకు సంబంధించి కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు ప్రధాని బోరిస్ జాన్సన్ జంకుతున్నారు. గత ఏడాది క్రిస్మస్ సందర్భంగా జాన్సన్ మంత్రి వర్గంలోని కొందరు నియమాలను ఉల్లంఘించడంపై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. అలాగే ఏదైనా నిర్ణయం తీసుకునేందుకు ప్రధాన ప్రతిపక్షమైన లేబర్ పార్టీ మద్దతుపై ఆయన ఆధారపడటం కూడా ఒక కారణంగా కనిపిస్తున్నది

# బ్యాంకు డిఫాల్టర్ల ఆస్తులు అమ్మి 13,109 కోట్లు రికవరీ: మంత్రి నిర్మల

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:బ్యాంకుల వద్ద రుణం తీసుకుని ఎగవేసిన డిఫాల్టర్ల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూల్ చేసినట్లు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. నీరవ్ మోదీ, విజయ్ మాల్యా లాంటి డిఫాల్టర్లకు చెందిన ఆస్తులను అమ్మి సుమారు 13,109 కోట్లు వసూల్ చేసినట్లు మంత్రి వెల్లడించారు. మనీల్యాండ్ చట్టం ద్వారా కేంద్ర దర్యాప్తు సంస్థలు డిఫాల్టర్లకు చెందిన ఆస్తులను సీజ్ చేసినట్లు ఆమె చెప్పారు. విజయ్ మాల్యా దివాళా తీసినట్లు ఇటీవల బ్రిటీష్ కోర్టు తెలిపింది. అయితే కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఆస్తులను అమ్మి .. భారతీయ బ్యాంకులకు బాకీపడ్డ రుణాలను చెల్లించాలని ఆ కోర్టు తన తీర్పులో ఆదేశించింది.

65 ఏళ్ల మాల్యా ప్రస్తుతం బ్రిటన్‌లో బెయిల్‌పై ఉంటున్నారు. ఎస్బీఐ బ్యాంకులకు మాల్యా సుమారు 9 వేల కోట్ల రుణాన్ని ఎగవేశారు. ఇక పీఎన్బీ బ్యాంకుల వద్ద నీరవ్ మోదీ సుమారు 13 వేల కోట్ల రుణం తీసుకుని ఎగవేశారు. గడిచిన ఏడేళ్లలో మిగిలి ఉన్న రుణాల నుంచి 5.49 లక్షల కోట్లు రికవరీ చేసినట్లు మంత్రి సీతారామన్ తెలిపారు.ఒక్క రెండు రాష్ట్రాలు మాత్రమే నెగటివ్ క్యాష్ బ్యాలెన్స్‌లో ఉన్నట్లు ఆమె చెప్పారు.

# కేంద్ర ప్రభుత్వంపై నిరసనలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మేయర్



న్యూఢిల్లీ, డిసెంబర్ 20:బీజేపీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తెలంగాణ రైతుల పట్ల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈరోజు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద లతో కలిసి గండి మైసమ్మ తెలంగాణ భవన్ వద్ద నుండి పాదయాత్ర గా గండి మైసమ్మ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి నిరసన కార్యక్రమంలో మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి , సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ చైర్మన్లు, కౌన్సిలర్లు, తెరాస పార్టీ అనుబంధ కమిటీల సభ్యులు, నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతుల కోసం వచ్చాం.. రాజకీయం చేయడానికి కాదు: మంత్రి నిరంజన్ రెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: రైతుల ప్రయోజనం కోసమే తాము ఢిల్లీకి వచ్చామని, రాజకీయం చేయడానికి రాలేదని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి తక్షణమే తమకు సమయం ఇవ్వాలని కోరారు. వీలైనంత త్వరగా సమయం ఇచ్చి తమ గోడు వినాలన్నారు. తమను నిరీక్షించేలా చేయడమంటే తెలంగాణ రైతులను అవమానించడమే అన్నారు. మంత్రులు జగదీశ్ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎర్రవల్లి దయాకర్ రావు, ఎంపీలు కేకే, నామానాగేశ్వర రావుతో కలిసి మంత్రి నిరంజన్ రెడ్డి న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. వానాకాలం ధాన్యం కొనుగోలుపై స్పష్టత కోసమే ఢిల్లీ వచ్చామని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి సమయం ఇచ్చేవరకు వేచిచూస్తామన్నారు.

గత యాసంగిలో కేంద్ర ఇచ్చిన టార్గెట్ ఎంత, కొన్నది ఎంత అని ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చిన టార్గెట్‌ను పెంచాలని గతంలోనే కోరామన్నారు. వరి ధాన్యం కోసం ఆరు వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. వానాకాలంలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం 42 లక్షల మెట్రిక్ టన్నుల టార్గెట్ ఇచ్చిందని, 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో మరో 12 నుంచి 15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందన్నారు. ఇంకా కొన్ని జిల్లాల్లో వరి కోతలే జరగలేదని, జనవరి 15 వరకు వరి కోతలు ఉంటాయని, 5 లక్షల ఎకరాల్లో వరి కోతకు సిద్ధంగా ఉందని చెప్పారు. నేటితో కేంద్రం ఇచ్చిన వరి ధాన్యం కొనుగోలు టార్గెట్ పూర్తవుతుందని చెప్పారు.

రాబోయే ధాన్యాన్ని కేంద్రం కొంటుందో లేదో చెప్పాలని, ఎంత ధాన్యం వస్తే అంత కొంటామని కేంద్రం రాతపూర్వకంగా చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంతో ఇప్పటికే చేదు అనుభవాలు ఉన్నాయన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అయోమయంలో ఉన్నారని చెప్పారు. వానాకాలం కొనుగోళ్లతో యాసంగిని ముడి పెడుతూ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇతర దేశాలకు ఎగుమతిపై రాష్ట్రాలకు అధికారం ఉండదని చెప్పారు.

వానాకాలంలో 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కొంటామన్నారని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాలని తాము కోరామని చెప్పారు. బియ్యం మిల్లింగ్ తరువాత తరలించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేశారు.

# ప్రధాన మంత్రి తో సమావేశమైన మధ్య ఆసియా దేశాల విదేశీ వ్యవహారాల శాఖ మంత్రులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తో 2021వ సంవత్సరం డిసెంబర్ 20వ తేదీ న కజాఖ్ స్తాన్, కిర్గిజ్ గణతంత్రం, తాజికిస్తాన్, తుర్క్ మెనిస్తాన్, ఇంకా ఉజ్ బెకిస్తాన్ ల విదేశీ వ్యవహారాల శాఖ మంత్రులు సమావేశమయ్యారు. మధ్య ఆసియా దేశాల కు చెందిన విదేశీ వ్యవహారాల శాఖ మంత్రులు ఇండియా-సెంట్రల్ ఏశియా డైలాగ్ తాలూకు మూడో సమావేశం లో పాల్గొనడం కోసం న్యూ ఢిల్లీ కి విచ్చేశారు.మధ్య ఆసియా దేశాల కు చెందిన విదేశీ వ్యవహారాల శాఖ మంత్రులు వారి వారి అధ్యక్షుల శుభాకాంక్షల ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ కి తెలియజేయడం తో పాటు గా వారి నాయకత్వం భారతదేశం తో సంబంధాల ను మరింత గా పటిష్ట పరచుకోవడం కోసం సిద్ధం గా ఉందని స్పష్టం చేశారు. భారతదేశం విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి అధ్యక్షత న 2021వ సంవత్సరం డిసెంబర్ 18వ, 19వ తేదీల లో జరిగిన ఇండియా-సెంట్రల్ ఏశియా డైలాగ్ తాలూకు చర్చోపచర్చల ను గురించి వారు ప్రధాన మంత్రి దృష్టి కి తీసుకు వచ్చారు. అఫ్ గానిస్తాన్ లో స్థితి సహా, ప్రాంతీయ పరిణామాలు, అభివృద్ధి సంబంధిత భాగస్వామ్యం, వ్యాపారం, ఇంకా సంధానం లపై ఆ చర్చల సందర్భం లో శ్రద్ధ తీసుకోవడం జరిగింది.మధ్య ఆసియా దేశాల తో చాలా కాలం గా ఉన్నటువంటి సంబంధాల కు భారతదేశం ప్రాముఖ్యాన్ని ఇస్తోందని, ఆ దేశాలు భారతదేశం అనుసరిస్తున్న 'ఎక్స్ టెండెడ్ నైబర్ హుడ్' విధానం లో పాలుపంచుకొంటున్నాయని ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. ఈ సంవత్సరం లో ఆ మధ్య ఆసియా దేశాల స్వాతంత్ర్యం తాలూకు 30 వ వార్షికోత్సవం కావడం తో ఆయన మంత్రుల కు తన అభినందనల ను వ్యక్తం చేశారు. 2015వ సంవత్సరం లో మధ్య ఆసియా దేశాలన్నిటిలోను, మరి ఆ తరువాత కజాఖ్ స్తాన్, ఉజ్ బెకిస్తాన్ మరియు కిర్గిజ్ గణతంత్రం లలోను తాను జరిపిన స్మరణీయ సందర్శనల ను ఆయన గుర్తుచేశారు. భారతదేశాని కి, మధ్య ఆసియా కు ప్రజా సంబంధాలు, సాంస్కృతిక సంబంధాలను కొనసాగించడానికి ప్రాముఖ్యాన్ని ఇవ్వాలని, ఈ ప్రాంతం లో భారతదేశ చలనచిత్రాలకు, సంగీతానికి, యోగ కు తదితర అంశాల కు గల ప్రజాదరణ ను పరిగణన లోకి తీసుకోవాలని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. అలాగే భారతదేశాని కి మరియు మధ్య ఆసియా కు మధ్య పరస్పర ఆర్థిక సహకారానికి అవకాశాలు ఇదివరకటి కన్నా పెరిగాయని, ఈ విషయం లో సంధానం తాలూకు పాత్ర ను గురించి కూడా ఆయన ప్రముఖం గా ప్రస్తావించారు.

భారతదేశాని కి, మధ్య ఆసియా దేశాల కు గల శ్రేష్ఠమైనటువంటి ద్వైపాక్షిక సంబంధాల కు ఇండియా-సెంట్రల్ ఏశియా డైలాగ్ ఉత్తేజాన్ని ఇచ్చింది. భారతదేశం తో పాటు మధ్య ఆసియా దేశాలు వాటి మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడిన దరిమిలా వచ్చే సంవత్సరం 30వ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నాయి.

# క్రిస్మస్ ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలి : మంత్రి తలసాని



హైదరాబాద్, డిసెంబర్ 20: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి క్రిస్మస్ వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం ఆయన ఎల్బీ స్టేడియంలో ఈ నెల 21 వ తేదీన ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు.

ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంత్రి శ్రీనివాస్ యాదవ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వేడుకలలో ముఖ్యమంత్రి, పలువురు క్రైస్తవ ప్రముఖులతో కలిసి పాల్గొంటారని చెప్పారు.

మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి సంబంధించి బ్రహ్మాండంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. క్రిస్మస్ ను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం పేద క్రైస్తవులకు ప్రభుత్వం గిఫ్ట్ ప్యాక్ లను పంపిణీ చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని చర్చిలలో క్రిస్మస్ విందులను నిర్వహిస్తూ వస్తుందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలు, సంస్కృతులను గౌరవిస్తుందని చెప్పారు. నగరంలోని అన్ని నియోజకవర్గాలలో ఎమ్మెల్యేల పర్యవేక్షణలో క్రిస్మస్ వేడుకలను ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. క్రిస్టియన్ సంక్షేమ భవన్ నిర్మాణం, చర్చిలు, గ్రేవ్ యార్డ్ ల అభివృద్ధి పై త్వరలోనే ఒక ప్రత్యేక సమావేశం కూడా నిర్వహించనున్నట్లు మంత్రి చెప్పారు.

కార్యక్రమంలో మంత్రి వెంట ఎమ్మెల్సీలు ఓ.వా.ప్రభాకర్, రాజేశ్వర్ రావు, ఎగ్గే మల్లేషం, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరు వెంకటేష్, బేతి సుభాష్ రెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, మైనార్టీ కార్పోరేషన్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, బెవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ గజ్జల నగేష్, నాంపల్లి నియోజకవర్గ ఒఖీూ పార్టీ ఇంచార్జి ఆనంద్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్‌కు మరో షాక్.. పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ గుడ్‌బై

పనాజీ, డిసెంబర్ 20:: గోవా అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అలెక్సో రెజినాల్డో లౌరెన్కో సోమవారం అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 40 మంది సభ్యులున్న అసెంబ్లీలో కాంగ్రెస్ బలం రెండుకు తగ్గింది. తాజాగా రాష్ట్రానికి చెందిన మరో ఇద్దరు కాంగ్రెస్ నేతలు సైతం ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేశారు.

రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పది మందితో తొలిజాబితా విడుదల చేయగా.. ఇందులో లౌరెన్కో పేరును సైతం చేర్చింది. దక్షిణ గోవా జిల్లాలోని కర్టోరిమ్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న ఆయన సోమవారం మధ్యాహ్న స్పీకర్ కార్యాలయంలో రాజీనామా పత్రాన్ని సమర్పించారు. లౌరెంకో త్వరలోనే మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ నెల ప్రారంభంలో మాజీ సీఎం రవినాయక్ సైతం కాంగ్రెస్, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు.

## తెలంగాణపై మోదీ సర్కారు కుట్ర : మంత్రి కొప్పుల

పెద్దపల్లి, డిసెంబర్ 20: యాసంగి ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తెలంగాణపై కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నదని మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్‌లో టీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి మంత్రి ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కరీంనగర్-రాయపట్నం రహదారిపై మంత్రి బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం మెయిన్ రోడ్డు నుంచి మల్లాపూర్ దాకా జరిగిన రైతుల ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో యాసంగి దొడ్డు ధాన్యం కొనుగోలు విషయంలో స్పష్టత ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం రైతులను వేధిస్తున్నదని దుయ్యబట్టారు. గత ఆరేండ్లపాటు సవ్యంగా దొడ్డు వడ్ల కొనుగోళ్లు జరుగ్గా, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం బాయిల్డ్ రైస్ కొనుగోలు చేయమని చేతులెత్తేయడం సరికాదని విమర్శించారు. యాసంగి ధాన్యం కొనుగోలుపై కేంద్రం తేల్చేదాకా రైతుల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డు వడ్లు కొనమని ఓ వైపు స్పష్టం చేస్తుంటే రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఇతర నాయకులు యాసంగిలో వరి సాగు చేయాలని పక్కదారి పట్టించేలా మాట్లాడుతున్న మాటలను రైతులు నమ్మవద్దని పేర్కొన్నారు.

### చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ శ్రేయో గుణగణములతో
పాయక శిష్టుల నాసంగ ప్రతిభుండనుచున్
ధీయుతుడు పరమాత్ముడు
"పీయన్భగవతి" కానంగ విఖ్యాతి వెసన్ !!

-రాధశ్రీ



సెల్: 9494481210

(డిసెంబర్ 21 మాజీ ప్రధాన న్యాయమూర్తి పి.యన్.భగవతి శత జయంతి....)


అహ్వానము

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ
& దర్పణం సాహిత్య వేదిక
సంయుక్త నిర్వహణలో



తేది : 21-12-2021 మంగళవారం మధ్యాహ్నం 2 గం॥లకు
స్థలం : రవీంద్రభారతి మొదటి అంతస్తు,హైదరాబాదు.
దర్పణం సాహిత్య వేదిక అధ్యక్షులు
డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు రచించిన
'వ్యాస గవాక్షం' గ్రంథ ఆవిష్కరణ

సభాధ్యక్షులు : డా. అమ్మంగి వేణుగోపాల్ గారు
ప్రముఖ కవి, కాళోజీ అవార్డు గ్రహీత
ముఖ్య అతిథి : డా. అయాచితం శ్రీధర్ గారు
తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షులు
గ్రంథ ఆవిష్కర్త : డా. నందిని సిధారెడ్డి గారు
తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు
విశిష్ట అతిథి : శ్రీ మామిడి హరికృష్ణ గారు
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు
ప్రధాన వక్త : ఆచార్య చెన్నకేశవరెడ్డి గారు
ప్రముఖ కవి, పూర్వ ఆచార్యులు, తెలుగు విశ్వవిద్యాలయం
గౌరవ అతిథులు : డా. ఏనుగు నరసింహారెడ్డి గారు
ప్రముఖ కవి, అదనపు కలెక్టరు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా
శ్రీ ఎ. రమేశ్ కుమార్ గారు
జిల్లా విద్యాధికారి, మెదక్ జిల్లా
కృతి స్వీకర్త : డా. ఇరివెంటి వెంకటరమణ (హిమజ్వాల) గారు
ప్రముఖ కవి

మిత్రులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని,
ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాం.

సభా సమన్వయం :
రామకృష్ణ చంద్రమౌళి, నక్క హరికృష్ణ,
ముదిగొండ సంతోష్, డా. కావూరి శ్రీనివాస్

-డా. చీదెళ్ల సీతాలక్ష్మి
ప్రధాన కార్యదర్శి
దర్పణం సాహిత్యవేదిక

అందరూ ఆహ్వానితులే....

# నేలలు, నీటి వనరుల నిర్వహణ పట్టుతప్పుతోందా..!

(ఐరాస ఆహార మరియు వ్యవసాయ సంస్థ నిర్వహించిన 'ఆహారం, వ్యవసాయం కోసం ప్రపంచ నేలలు, నీటి వనరుల స్థితిగతులు' నివేదిక ఆధారంగా)

ఐక్యరాజ్యసమితిలో ప్రధాన అందమైన 'ఆహారం మరియు వ్యవసాయ సంస్థ (యూయన్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్)' తాజాగా విడుదల చేసిన 'ఆహారం, వ్యవసాయం కోసం ప్రపంచ నేలలు, నీటి వనరుల స్థితిగతుల(స్టేట్ ఆఫ్ ది వరల్డ్స్ లాండ్ అండ్ వాటర్ రిసోర్సెస్ ఫర్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్)' అధ్యయన నివేదిక పలు ఆసక్తికర విషయాలతో పాటు రాబోయే కాలంలో ఎదుర్కోవలసిన ఇక్కట్లను నిక్కచ్చి హెచ్చరికలుగా బహిర్గతం చేసింది. గత 50 ఏండ్లుగా ప్రపంచ వ్యవసాయ నేలలు 12 శాతం, వ్యవసాయ ఉత్పత్తులు 2.5-3 శాతం వరకు పెరిగాయని, జనాభా పెరుగుదలతో తలసరి సాగు నేలలు 0.25 హెక్టార్లు తగ్గాయని వెల్లడైంది. వ్యవసాయ నేలల విస్తీర్ణం పెరగడంతో నేలలు, నీటి వనరుల క్షీణత లేదా చెడిపోవడం జరిగిందని తెలియజేసింది. కార్బన్ నిల్వలు, బయోమాస్, మట్టి నాణ్యత, నీటి నిల్వలు, నీటి సరఫరా, జీవవైవిధ్యం, సాంఘీక సాంస్కృతిక సేవలు లాంటి రంగాలు క్షీణతకు గురి అవుతున్నాయని కూడా వివరిస్తున్నది. వ్యవసాయం కోసం 11 శాతం ప్రపంచ నేలలను వినియోగించడంతో పాటు అందుబాటులో ఉన్న 70 శాతం నీటి వనరులను అనాలోచితంగా వాడడం జరుగుతున్నదని నివేదిక వివరిస్తున్నది. వ్యవసాయ చట్టాలు రైతులకు మేలు చేసేవిగా ఉండేలా నేల, నీటి వనరులను కల్పించడం జరిగినా చిన్న సన్నకారు రైతుల పేదరికం మాత్రం ఆశించినంతగా తగ్గలేదని తెలుస్తున్నది. నేల నాణ్యత క్రమంగా క్షీణించడంతో పాటు వాతావరణ ప్రతికూలతలు, పేదరికం కూడా ప్రమాదకర స్థాయిలోకి మారుతున్నాయి. వ్యవసాయ అభివృద్ధికి సారవంతమైన నేలలు, నీటి వనరులు తప్పనిసరి అని మనకు తెలుసు. నీటి వనరులకు, నేల లభ్యతకు విడదీయరాని సంబంధం ఉండడంతో పాటు వాటి మధ్య పోటీ పెరగడంతో ఈ సహజ వనరుల కొరత ఏర్పడే దుస్థితిలో ప్రపంచ మానవాళి కొట్టుమిట్టాడుతూ ఉంది.

2009తో పోల్చితే 2050 నాటికి పెరుగుతున్న జనాభాకు సమాంతరంగా ఆదాయాలు పెరగడానికి 70 శాతం వరకు ఆహార ఉత్పత్తులు పెరగాలని, అభివృద్ధి చెందిన దేశాల్లో 100 శాతం వరకు పెరగాల్సిన అగత్యం ఏర్పడనుందని పేర్కొనబడింది. తలసరి వ్యవసాయ నేలల విస్తీర్ణం అధిక ఆదాయ దేశాలతో పోల్చితే అల్పాదాయ దేశాల్లో 50 శాతం వరకు తక్కువగా ఉండడం గమనించబడింది. నేలలు, నీటి వనరులను అవసరానికి అనుగుణంగా పెంచుకోవడం అంత సులభం కాదని మనకు తెలుసుకోవాలి. పేద దేశాల్లో జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తులు పెంచుకోవడానికి నేల, నీటి తీవ్ర కొరతలు అడ్డు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న వ్యవసాయ నేలల్లో అధిక దిగుబడులు సాధించడం, ఆధునిక వ్యవసాయ పద్దతులు పాటించడం, పంటలను ఎంచుకోవడం, సుస్థిర నేలల నిర్వహణ మార్గాలు అవలంభించడం, వ్యవసాయ నీటిని పొదుపుగా వాడుకోవడం లాంటి జాగ్రత్తలు విధిగా పాటించాలి. వ్యవసాయ నేలలు, నీటి వనరులను అతిగా వాడితే భవిష్యత్తులో ఆహార ఉత్పత్తులు తగ్గడం, నేల నాణ్యతలు క్షీణించడం, నీటి వనరులు ఎండిపోవడం, వాతావరణ ప్రతికూల మార్పులు జరగడం, జీవవైవిధ్యం ప్రభావితం కావడం లాంటి దుష్ప్రభావాలు కలుగుతాయని గుర్తుంచుకోవాలి.

ప్రకృతి ప్రసాదించిన నేలలు, నీటి వనరులను దైవ ప్రసాదంగా భావించడంతో పాటు తెలివిగా వినియోగించుకోవడం నేర్చుకోవాలి. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ పేదరిక నిర్మూలన, జనాభాకు తగిన వ్యవసాయ ఉత్పత్తులు పెంచుకోవడానికి శాస్త్రీయ సుస్థిర మార్గాలు అవలంభించడం మాత్రమే మన భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ఈ మహా యజ్ఞంలో ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు, రైతు సమాజం సమన్వయంతో మన నేలలు, నీటి వనరులను అమూల్య ఆస్తులుగా స్మార్ట్‌గా వాడుకోవడానికి అలవాటు పడాల్సిన అగత్యం ఏర్పడింది. నేలలు, నీటి వనరుల పరిరక్షణకు తీసుకోవలసిన చర్యల్లో నేల నాణ్యతను కాపాడుతూ సాగు కొనసాగించడం, ఈ రెండు వనరులను కాపడానికి మార్గనిర్ధేశనం చేయగల బలమైన సంస్థలను ఏర్పాటు చేయడం, రైతులకు ఆధునిక పద్దతుల్లో సాగు పద్దతుల్లో శిక్షణలు ఇవ్వడం, వనరులు కాపాడుకోవడానికి పరిశోధనలు కొనసాగించడం, గ్రామీణ సాగుకు ఆర్థిక చేయూతలు అందించడం, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం లాంటి పద్దతులు పాటించాలి. సుస్థిర సాగు నేలలు, నీటి నిర్వహణ పద్దతులు అమలు చేయడానికి ప్రభుత్వ నిధుల కేటాయింపు, రాజకీయ పట్టుదల, ఆర్థిక సహాయం చేసే సంస్థల సమిష్టి కృషితో అవసరమైన వ్యవసాయ సాగు పద్దతులు పాటించబడాలి. రాబోయే రోజుల్లో పెరుగుతున్న జనాభాకు అవసరమైన ఆహార ఉత్పత్తులకు సాగు నేలలు, నీటి వనరుల అందుబాటు తప్పనిసరి అని గమనించి ప్రణాళికలు వేయాలి. నేలలు, నీటి వనరుల నిర్వహణకు నియంత్రణ లేకపోవడం, కావలసిన నిధులను ప్రభుత్వాలు కేటాయించలేక పోవడం జరుగుతానే ఉంది. పేదరిక నిర్మూలన, పోషకాహార లోపాలను అధిగమించడానికి సాగు నేలలు, నీటి వనరులను శాస్త్రీయ పద్దతుల్లో సుస్థిరాభివృద్ధి దిశగా నిర్వహించుకోవాలని, భవిష్యత్తు జనాభాకు పోషకాహారం అందేలా నేటి నిర్వహణ పద్దతులు ఉండాలి. నేటి నిర్లక్ష్యం రేపటి తరానికి శాపం కారాదు.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, పీఎఫ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:వ్యూహాత్మక భాగస్వామితో 25-10-2021న చేసుకున్న ఒప్పందంపై సంతకాలలో ఉద్యోగుల ప్రయోజనాలను గురించి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది.

వర్తించే చట్టాలకు అనుగుణంగా, వ్యూహాత్మక భాగస్వామి పెట్టుబడుల ఉపసంహరణ తర్వాత, ఉద్యోగులకు గ్రాట్యుటీ, పిఎఫ్ ప్రయోజనాలను అందించడం కొనసాగించాలి. ప్రస్తుతమున్న ఎయిర్ ఇండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఉద్యోగుల సెల్ఫ్ కంట్రిబ్యూటరీ సూపర్‌యాన్యుయేషన్ పెన్షన్ ట్రస్టు ఫండును నిర్వహించడం కోసం ఉద్యోగులు, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో చేసిన ఏర్పాటు కొనసాగుతుంది. ఇక వైద్య ప్రయోజనాలకు సంబంధించి, ఎయిర్ ఇండియా నుంచి పదవీవిరమణ చేస్తున్న అర్హులైన, ఇప్పటికే పదవీకాలం పూర్తి చేసుకున్నవారికీ వాటిని ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.

ఈ సమాచారాన్ని నేడు రాజ్యసభలో నేడు అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం రూపంలో పౌర విమానాయాన మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి (జనరల్. (డాక్టర్) వి.కె. సింగ్ (రిటైర్డ్) అందించారు.

## గోవా విముక్తి దిన వజ్రోత్సవ వేడుకలలో పాల్గొన్న భారతీయ నావికా దళం

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:ప్రతి ఏడాదీ డిసెంబర్ 19న గోవా రాష్ట్రం విముక్తి దినోత్సవంగా జరుపుకుంటుంది. గోవా స్వాతంత్ర్యాన్ని సాధించి 60 సంవత్సరాలు అయిన సందర్భంగా, 19 డిసెంబర్ 2021న పానాజీలో వజ్రోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భ జ్ఞాపకార్థం గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆజాద్ మైదాన్‌లోని అమరవీరుల స్మారకచిహ్నం (మార్టియర్స్ మెమోరియల్) పై పుష్పగుచ్ఛాన్ని ఉంచారు. ఈ సందర్భంగా త్రివిధ దళాలకు చెందిన 100మంది గార్డ్ ఆఫ్ ఆనర్‌ను చేస్తున్న సందర్భంగా వాద్యకారులు ది లాస్ట్ పోస్ట్ వాయించారు.

దీనితోపాటుగా, ప్రధానమంత్రి భారతీయ నావికాదళం, కోస్ట్‌గార్డ్, నావలతో పెరేడ్ ఆఫ్ సెయిల్స్ ను, అలాగే, పౌర ఏజెన్సీలు, భారతీయ నావికాదళపు విమానం ఫ్లైపాస్ట్‌ను మిరామర్ బీచ్ నుంచి తిలకించారు.

వైస్ అడ్మిరల్ అజేంద్ర బహదూర్ సింగ్, ఫ్లాగ్ కమాండింగ్- ఇన్-చీఫ్, వెస్టర్న్ నావల్ కమాండ్, రేర్ అడ్మిరల్ ఫిలిపోస్ జి పున్యుమూతిల్, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ గోవా ఏరియాల సమక్షంలో భారతీయ నావికాదళం వజ్రోత్సవ కార్యక్రమాలను సమన్వయపరిచింది.

## గాంధీ ఆస్పత్రిలో జీనోమ్ సీక్వెన్సింగ్.. అందుబాటులోకి తేనున్న ప్రభుత్వం..



న్యూఢిల్లీ, డిసెంబర్ 20:సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జీనోమ్ సీక్వెన్సింగ్ అందుబాటులోకి రాబోతుంది. ఒమిక్రాన్ కేసులు పెరుగుతున్న క్రమంలో అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం.. ఒమిక్రాన్‌ను గుర్తించే జీనోమ్ సీక్వెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తోంది. సోమాలియా నుంచి వచ్చిన వ్యక్తికి కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ కావడంతో ముందుగా టిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో టిమ్స్ నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

గాంధీ ఆసుపత్రిలో ఒమిక్రాన్ జీనోమ్ సీక్వెన్సింగ్ అందుబాటులోకి వస్తే, రోజుకు 48శాంపిళ్లను పరీక్షించే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు. ఒమిక్రాన్ కేసులు పెరుగుతున్న ఈ ప్రక్రియ అందుబాటులోకి వస్తే పని వేగంగా జరుగుతుందని అభిప్రాయపడ్డారు డాక్టర్లు. గాంధీలోనే జీనోమ్ సీక్వెన్సింగ్‌తో త్వరగా ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు. భారత్‌పై ఒమిక్రాన్ వేరియంట్ తన ప్రతాపాన్ని చూపిస్తోండగా.. వైరస్ సోకినవారి సంఖ్య ప్రతిరోజు పదుల సంఖ్యలో నమోదువుతున్నాయి. మొత్తం 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త వేరియంట్ వ్యాపిస్తోంది. ఇండియాలో ఇప్పటికే ఒమిక్రాన్ బాధితుల సంఖ్య 173కు చేరింది.

## 23న కేఆర్‌ఎంబీ భేటీ.. పాల్గొననున్న ఐదు రాష్ట్రాల అధికారులు

అమరావతి, డిసెంబర్ 20ఈ నెల 23న చెన్నైలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆధ్వర్యంలో తాగునీటి కమిటీ సమావేశం జరుగనున్నది. వర్చువల్ విధానంలో కమిటీ ఆరో సమావేశం జరుగనుండగా.. మీటింగ్‌లో ఐదు రాష్ట్రాల అధికారులు పాల్గొనున్నారు. కేఆర్‌ఎంబీ ప్రతినిధులతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రకు చెందిన అధికారులు హాజరుకానున్నారు.

ఈ సందర్భంగా తెలుగుగంగ ద్వారా చెన్నైకి 15 టీఎంసీల తాగునీటి సరఫరా అంశంపై కేఆర్‌ఎంబీ ప్రతినిధులు, ఐదు రాష్ట్రాల అధికారులు చర్చించనున్నారు.




# నేడు ప్రయాగ్ రాజ్ ను సందర్శించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2021 వ సంవత్సరం డిసెంబర్ 21 వ తేదీ న ప్రయాగ్ రాజ్ ను సందర్శించనున్నారు. మధ్యాహ్నం పూట ఒంటి గంట వేళ కు జరిగే ఒక ప్రత్యేకమైన కార్యక్రమం లో 2 లక్షల కు పైగా మహిళలు హాజరు కానుండగా, ప్రధాన మంత్రి ఆ కార్యక్రమం లో పాలుపంచుకోనున్నారు.

ఈ కార్యక్రమాన్ని మహిళల కు, ప్రత్యేకించి క్షేత్ర స్థాయి లో మహిళల కు, అవసరమైన నైపుణ్యాల ను, ప్రోత్సాహకాల ను మరియు వనరుల ను సమకూర్చడం ద్వారా వారి సశక్తీకరణ కు తోడ్పడాలన్న ప్రధాన మంత్రి దృష్టి కోణాని కి అనుగుణం గా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నది. మహిళల కు మద్దతివ్వాలన్న ఈ ప్రయాస లో భాగం గా ప్రధాన మంత్రి 1000 కోట్ల రూపాయల సొమ్ము ను స్వయం సహాయ సమూహాల (ఎస్ హెచ్ జి స్) బ్యాంకు ఖాతాల లోకి బదిలీ చేయనున్నారు. దీని ద్వారా దాదాపు గా 16 లక్షల మంది ఎస్ హెచ్ జి స్ కు చెందిన మహిళా సభ్యులు ప్రయోజనాన్ని అందుకోనున్నారు. దీన్ దయాళ్ అంత్యోదయ యోజన్- నేశనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిశన్ (డిఎవై-ఎన్‌ఆర్‌ఎల్‌ఎమ్) లో భాగం గా ఈ బదిలీ జరుగుతుంది. 80,000 ఎస్ హెచ్ జి లు ఒక్కొక్క ఎస్ హెచ్ జి 1.10 లక్షల రూపాయల విలువైన కమ్యూనిటీ ఇన్వెస్ట్ మెంట్ ఫండ్ (సిఐఎఫ్) ను, అదే విధం గా 60,000 ఎస్ హెచ్ జి లు ఒక్కొక్క ఎస్ హెచ్ జి 15,000 రూపాయల విలువైన రివాల్వింగ్ ఫండ్ ను అందుకొంటాయి.

ఇదే కార్యక్రమం లో బిజినెస్ కరస్పాండెంట్-సఖీస్ ను (బి.సి.-సఖీస్) ను ప్రోత్సహించడం కోసం ప్రధాన మంత్రి 20,000 బి.సి.-సఖీస్ కు ఒకటో నెల స్టైపెండ్ రూపం లో 4000 రూపాయల ను బదిలీ చేయనున్నారు. క్షేత్ర స్థాయి లో ఇంటి ముంగిటకే ఆర్థిక సేవల ను అందించే బి.సి.-సఖులు వారి విధుల ను ఆరంభించడం తోనే వారికి 4000 రూపాయల స్టైపెండ్ ను ఆరు నెలల పాటు చెల్లించడం జరుగుతుంది. ఇలా చేయడం వల్ల, వారు వారి విధుల ను స్థిరపరచుకొని, ఆ తరువాత లావాదేవీల తాలూకు కమిశన్ ను సంపాదించుకోవడం మొదలు పెడతారు.

ప్రధాన మంత్రి ఈ కార్యక్రమం లో భాగం గా 'ముఖ్యమంత్రి కన్య సుమంగళ స్కీము' తాలూకు ఒక లక్ష మంది కి పైగా లబ్ధిదారుల కు 20 కోట్ల రూపాయల పై చిలుకు ధన రాశి ని సైతం ప్రధాన బదిలీ చేయనున్నారు. ఈ పథకం ద్వారా ఒక ఆడ శిశువు కు ఆమె జీవనం తాలూకు వేరు వేరు దశల లో షరతు తో కూడిన నగదు బదిలీ అమలు అవుతుంది. ప్రతి ఒక్క లబ్ధిదారు కు మొత్తం 15,000 రూపాయల డబ్బు ను బదిలీ చేయడం జరుగుతుంది. ఆ సొమ్ము ను ఆడ శిశువు పుట్టినప్పుడు (2000 రూపాయలు), ఆ శిశువు టీకామందు తీసుకొని ఒక సంవత్సర కాలం పూర్తి అయినప్పుడు (1000 రూపాయలు), ఒకటో తరగతి లో చేరినప్పుడు (2,000 రూపాయలు), ఆరో తరగతి లో చేరినప్పుడు (2000 రూపాయలు), తొమ్మిదో తరగతి లో చేరినప్పుడు (3000 రూపాయలు), పదో తరగతి లేదా పన్నెండో తరగతి పరీక్ష లో ఉత్తీర్ణత సాధించిన అనంతరం ఏదైనా డిగ్రీ లో గాని, లేదా డిప్లొమా కోర్సు లో గాని చేరినప్పుడు (5000 రూపాయలు వంతు న) ఇలాగ వివిధ దశల లో బదిలీ అవుతుంది.

ప్రధాన మంత్రి 202 సప్లిమెంటరీ న్యూట్రిశన్ మేన్యుఫాక్చరింగ్ యూనిట్స్ కు శంకుస్థాపన చేస్తారు. ఈ యూనిట్ లకు స్వయం సహాయ సమూహాలు నిధుల ను అందిస్తాయి. ఒక్కొక్క యూనిట్ ను సుమారు గా ఒక కోటి రూపాయల ఖర్చు తో నిర్మించడం జరుగుతుంది. ఈ యూనిట్ లు రాష్ట్రం లోని 600 బ్లాకుల లో ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్ మెంట్ స్కీము (ఐసిడిఎస్) లో భాగం గా అదనపు పోషణ ను సమకూర్చుతాయి.

# సాక్షర భారత్ నిర్మాణానికి పునరంకితమవుదాం: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:సంపూర్ణ సాక్షరత సాధించే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు ప్రైవేటు రంగంతోపాటు ఇతర భాగస్వామ్య పక్షాలు సహకారం అందిస్తూ.. సాక్షర భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పునరంకితం అవ్వాల్సిన అవసరం ఉందని గౌరవ భారత ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. వయోజన విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధి తదితర ముఖ్యమైన అంశాలపైనా ప్రత్యేకమైన దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

సంపూర్ణ సాక్షరత సాధించే క్రమంలో డిజిటల్ సాక్షరత, ఆర్థిక సాక్షరతలకు కూడా పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

ఆదివారం ఉపరాష్ట్రపతి నివాసంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ సమావేశ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ప్రతిష్టాత్మక నెహ్రూ, ఠాగూర్ సాహిత్య అవార్డుల ప్రదానోత్సవంలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యావద్భారతం నుంచి నిరక్షరాస్యత నిర్మూలన కార్యక్రమం విజయవంతానికి యువత ముందుకు రావాలని సూచించారు. యువత తమకు సమీపంలో ఉన్న ప్రాంతాలను తరచుగా సందర్శిస్తూ.. అక్కడి వయోజనులకు రాయడం, చదవడం, డిజిటల్ పరికరాల వినియోగం తదితర అంశాలపై తమకున్న జ్ఞానాన్ని పంచేందుకు ప్రయత్నించాలన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) లాగే, ప్రతి ఒక్కరూ మరొకరికి చదువు నేర్పించడాన్ని వ్యక్తిగత సామాజిక బాధ్యత (వీఎన్ఆర్)గా తీసుకోవాలని ఉపరాష్ట్రపతి సూచించారు.

వయోజన విద్యను ప్రోత్సహించే దిశగా భారత వయోజన విద్య సంఘం (ఐఏఈఏ) చేస్తున్న కృషిని ఉపరాష్ట్రపతి అభినందించారు. 'విద్య ద్వారా సాధికారత లభిస్తుంది. అది ప్రజల జీవితాల్లో సరికొత్త మార్పును తీసుకొస్తుంది. వారిలో చైతన్యం కలిగించడంతోపాటు వారిని దేశాభివృద్ధిలో భాగస్వాములయ్యేలా చేస్తుంది' అని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

అక్షరాస్యత రేటుకు దేశాల అభివృద్ధికి ప్రత్యక్షమైన సంబంధం ఉంటుందన్న ఉపరాష్ట్రపతి.. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలు సక్రమంగా, సమాజంలోని చివరి వ్యక్తికి చేరవేయడంలో అక్షరాస్యత ప్రధానమైన భూమిక పోషిస్తుందన్నారు.

విద్యతోపాటుగా నైపుణ్యాభివృద్ధి కూడా అత్యంత కీలకమైన అంశమన్న ఉపరాష్ట్రపతి భారతదేశంలోని ప్రజల్లో మరీ ముఖ్యంగా యువతలో ప్రతిభాపాటవాలకు కొదువలేదని, ఆ సామర్థ్యాన్ని గుర్తించి దానికి పదును పెట్టడం ద్వారా సానుకూల మార్పులకు బీజం వేయవచ్చని సూచించారు.

నిరక్షరాస్యతతోపాటు సమాజంలో పేరుకుపోయిన అవినీతి, లింగ వివక్ష, కుల వివక్ష వంటి సామాజిక రుగ్మతలు, గ్రామీణ-పట్టణాల మధ్య విద్య, వైద్యం, సాంకేతికత సహా వివిధ అంశాల్లో నెలకొన్న అంతరాలు భారత అభివృద్ధికి ప్రధానమైన అవాంతరాలుగా మారుతున్నాయని ఉపరాష్ట్రపతి అన్నారు. వీటిని తొలగించేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కృషికి అన్ని భాగస్వామ్య పక్షాలు సంపూర్ణ సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు.

నూతన జాతీయ విద్యావిధానం ? 2020 కూడా వయోజన విద్యతోపాటు వివిధ అంశాల్లో అనుసరించాల్సిన విధివిధానాలకు సంబంధించిన ఓ దార్శనిక పత్రమన్న ఉపరాష్ట్రపతి అన్ని రాష్ట్రాలూ ఎన్ఈపీ-2020ని అమలు చేయాలని ఆయన సూచించారు. సరైన విద్యను అందించడం ద్వారానే కేంద్ర ప్రభుత్వం సంకల్పించిన 'శిక్షిత్ ఔర్ సమర్థ భారత్' నిర్మాణం సాధ్యమవుతుందన్నారు.

2019, 2020 సంవత్సరాలకు గానూ నెహ్రూ, ఠాగూర్ అక్షరాస్యత అవార్డులను ఉపరాష్ట్రపతి అందజేశారు. 2019 సంత్సరానికి గానూ నెహ్రూ అక్షరాస్యత అవార్డును ఆంధ్రప్రదేశ్ కు చెందిన ప్రొఫెసర్ పి. ఆదినారాయణ రెడ్డి, ఠాగూర్ అవార్డును ప్రొఫెసర్ అనిత దిఘే అందుకోగా.. 2020 సంవత్సరానికి గానూ నెహ్రూ అవార్డును ఆంధ్రప్రదేశ్ కు చెందిన ప్రొఫెసర్ ఎంసీ రెడ్డప్పరెడ్డి, ఠాగూర్ అవార్డును శ్రీమతి నిశాత్ ఫారూఖ్‌కు ఉపరాష్ట్రపతి అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఐఏఈఏ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎల్ రాజా, సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీ సురేశ్ ఖండేల్ వాల్, సలహాదారు శ్రీ కేసీ చౌదరితోపాటు వయోజన విద్యాభివృకోసం కృషిచేస్తున్న ప్రముఖులు, అవార్డు గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో బయో సీఎన్‌జీ ప్లాంట్ ప్రారంభించిన హరీశ్‌రావు




సిద్దిపేట, డిసెంబర్ 20:గతంలో సిద్దిపేట అంటే.. నలు దిక్కులా చెత్తతో కనిపించే ప్రదేశాలుండేవి. సిద్దిపేటలో చెత్త కుప్పలు ఉండకూడదనే ఉద్దేశంతోనే బయో-అౌఉ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్‌లో సోమవారం బయో-సీఎన్‌జీ ప్లాంట్‌ను బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ డాక్టర్ ఆండ్రూ ఫ్లెమింగ్ తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. బయో-అౌఉ ఏర్పాటుకు బలం, బలగం సిద్దిపేట పుర ప్రజలని పేర్కొన్నారు. చెత్తను తడి, పొడి, హానికారక చెత్తను విభజన చేయడం వల్లే బయో ? అౌఉ ఏర్పాటు సాధ్యం అయ్యిందన్నారు. అభివృద్ధి అంటే..ఆరోగ్య వాతావరణంలో జీవించే గలిగే పరిస్థితులను సృష్టించడమని స్పష్టం చేశారు. చెత్తను ఆదాయ వనరుగా మార్చుతున్నాం. బయో ? అౌఉ గ్యాస్ ను పట్టణంలో రెస్టారెంట్లకు సరఫరా చేస్తాం. మున్సిపల్ వాహనాలకు ఇంధనంగా బయో ? అౌఉ గ్యాస్ ను ఉపయోగిస్తామని మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు.

## ఎంవీ కవరట్టిని సురక్షితంగా కొచ్చికి తీసుకువచ్చిన ఐఎన్ఎస్ శార్దూల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:30 నవంబర్ 21వ తేదీన ఎంవీ కవరట్టినిలోని (లక్షద్వీప్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ రన్ షిప్) స్టార్‌బోర్డ్ ఇంజిన్ రూమ్‌లో మంటలు చెలరేగాయి, ఆ తర్వాత సిబ్బంది దానిని ఆర్పివేశారు. ఈ అగ్ని ప్రమాదం కారణంగా ఈ ఓడలోని ఇంజిన్‌లు స్టార్ట్ కాలేదు. దీంతో 30 నవంబర్ 21న ఈ ఓడ ఆండ్రోత్ ద్వీపంలో లంగరు వేసింది. ఓక మరమ్మతుల చేసేందుకు వీలుగా టోయింగ్ సహాయం కోసం ఈ ఓడ అక్కడే వేచి ఉంది. మరమ్మత్తుల కోసం ఓడను ఆండ్రోత్ నుండి కొచ్చికి తీసుకురావాలని లక్షద్వీప్ పరిపాలన విభాగం భారత నావికాదళాన్ని కోరింది. ఈ అభ్యర్థన ఆధారంగా భారత నౌకాదళం త్వరితగతిన ఐఎన్ఎస్ శార్దూల్‌ను డిసెంబరు 16న సముద్రంలో నిలిచిపోయిన నౌకకు సహాయం అందించడం కోసం ఆండ్రోత్‌కు పంపింది. ఐఎన్ఎస్ శార్దూల్ 17 డిసెంబర్ 21 ఉదయం ఆ ప్రాంతానికి చేరుకుంది. ఆఫీసర్-ఇన్-చార్జ్ నేవల్ డిటాచ్‌మెంట్ ఆండ్రోత్ లెటెనెంట్ కమాండర్ బిష్ణు సి పాండాతో ఐఎన్ఎస్ శార్దూల్‌లోని అధికారులు మరియు నావికుల నిపుణుల బృందం డిసెంబర్ 17న ఎంవీ కవరట్టికి 17 డిసెంబర్ 21న బయలుదేరి వెళ్లారు. ఈ బృందం కలిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసింది. ఈ సమయంలోనే నౌకాశ్రయం యొక్క పోర్ట్ ఇంజిన్‌ను ప్రారంభించడంలో ఎంవీ కవరట్టి సిబ్బందికి నౌకాదళ సిబ్బంది సహాయం చేశారు. ఐఎన్ఎస్ శార్దూల్ ద్వారా టోయింగ్ గేర్లు ఎంవీ కవరట్టికి పంపబడ్డాయి. ఎంవీ కవరట్టితో టోయింగ్ ట్రయల్స్ కూడా నిర్వహించబడ్డాయి. ట్రయల్స్ పోర్ట్ ప్రధాన ఇంజిన్ విఫలమైతే టోయింగ్ ఆపరేషన్ల పట్ల ఎంవీ కవరట్టి సిబ్బందికి చాలా అవసరమైన విశ్వాసం మరియు భరోసాను అందించబడ్డాయి. వివిధ అత్యవసర పరిస్థితులను రిహార్సల్ చేసిన తర్వాత ఐఎన్ఎస్ శార్దూల్, ఎంవీ కవరట్టిని 18 డిసెంబర్ 21వ తేదీ సాయంత్రం కొచ్చికి సురక్షితంగా తీసుకువచ్చింది. ఈ రవాణా సమయంలో ఐఎన్ఎస్ శార్దూల్ మరియు నేవల్ డిటాచ్‌మెంట్ ఆండ్రోత్ నుండి సిబ్బంది ఏదైనా యంత్రాలు పాడైపోయినప్పుడు ఎంవీకి సహాయం అందించడానికి బయలుదేరారు. ఈ విధంగా భారత నౌకాదళం ఎంవీ కవరట్టిని సురక్షితంగా కొచ్చికి తీసుకువచ్చే విషయమై విజయం సాధించింది.

## డెబిట్, క్రెడిట్ కార్డు యూజర్లకు అప్‌డేట్.. జనవరి నుంచి మారనున్న రూల్స్..




న్యూఢిల్లీ, డిసెంబర్ 20:క్రెడిట్, డెబిట్ కార్డు యూజర్లకు ముఖ్య గమనిక.. ఇకపై అన్ని డెబిట్, క్రెడిట్ కార్డుల ట్రాన్సాక్షన్ల విషయంలో వచ్చే ఏడాది నుంచి కొత్త రూల్స్‌ను రిజర్వ్ బ్యాంకు అందుబాటులోకి తెస్తోంది. డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిపే ట్రాన్సాక్షన్స్‌ని మరింత సేఫ్‌గా మార్చాలనే లక్ష్యంతో ఆర్బీఐ కొత్త రూల్స్‌ను తీసుకురానుంది. క్రెడిట్, డెబిట్ కార్డులను ఉపయోగించి జరిపే ఆన్‌లైన్ లావాదేవీలకు ఆర్బీఐ కీలక ఆదేశాలను జారీ చేసింది. ఆయా వెబ్‌సైట్లు, పేమెంట్ గేట్‌వేస్‌లలో అంతకుముందే నిక్షిప్తమైన క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు వివరాలు ఇకపై నిక్షిప్తం కావు.

ఆర్బీఐ కొత్త రూల్స్ ప్రకారం.. ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు లేదంటే డిజిటల్ చెల్లింపులు చేసేటప్పుడు ఆయా వెబ్‌సైట్స్, యాప్స్ వంటివి కస్టమర్ల క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు వివరాలను స్టోర్ చేయకూడదని ఆర్బీఐ పేర్కొంది. ఈ కొత్త రూల్స్ జనవరి 1 నుంచి అమలులోకి రానున్నట్టు తెలిపింది ఆర్‌బీఐ. దీంతో వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు కచ్చితంగా 16 అంకెల డెబిట్, క్రెడిట్ కార్డు నంబర్లతో పాటు, సీవీవీ, గడువు తేదీ వంటి వివరాలను గుర్తుంచుకోవాలి. ఒక వేళ ఇది వీలు కాకుంటే?టోకెనైజేషన్ పద్ధతిని వాడాల్సి ఉంటుంది. ఆర్బీఐ 2020 మార్చి నెలలోనే ఈ విషయాన్ని వెల్లడించింది. డేటా సెక్యూరిటీ నిబంధనల ప్రకారం.. వెబ్‌సైట్స్, యాప్స్ కస్టమర్ల కార్డుల వివరాలను స్టోర్ చేయకూడదని ఆదేశించింది.

టోకెనైజేషన్ అంటే ఏమిటి..?

ఆన్‌లైన్ లావాదేవీలను జరిపేటప్పుడు ఖాతాదారులు 16 అంకెల క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలను గుర్తుంచుకోక పోతే.. టోకెనైజేషన్ విధానాన్ని వాడవచ్చు. ఈ సిస్టంతో ఆయా క్రెడిట్, డెబిట్ కార్డు యూజర్లు వారి కార్డు వివరాలను తెలియజేయాల్సిన పని లేదు. ఒరిజినల్ కార్డు నెంబర్‌కు బదులు ప్రత్యామ్నాయ ఎన్‌క్రిప్టెడ్ కోడ్‌ను బ్యాంకులు ఇస్తాయి. దీన్ని టోకెన్ అని పిలుస్తారు. లావాదేవీ సమయంలో ఈ కోడ్‌ను అందిస్తే సరిపోతుంది.

## చైనాలో భారత నూతన రాయబారిగా ప్రదీప్‌కుమార్ రావత్

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: చైనాలో భారత రాయబారిగా సీనియర్ దౌత్యాధికారి ప్రదీప్ కుమార్ రావత్ నియమితులయ్యారు.

ఈ విషయాన్ని సోమవారం భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. 1990 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి ప్రదీప్ రావత్.. ప్రస్తుతం నెదర్లాండ్‌లో భారత రాయబారిగా పనిచేస్తున్నారు. తాజాగా ఆయనను చైనాలో రాయబారిగా నియమించినందున త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ప్రస్తుతం చైనా రాయబారిగా విక్రమ్ మిస్రీ పనిచేస్తున్నారు. ఆయన నుంచి ప్రదీప్ రావత్ బాధ్యతలు తీసుకోనున్నారు. తూర్పు లఢఖ్‌లో ఉద్రిక్త పరిస్థితుల నడుమ ప్రదీప్ రావత్ చైనాలో భారత రాయబారిగా బాధ్యతలు చేపడుతున్నారు. కాగా ప్రదీప్ రావత్ గతంలో హాంకాంగ్, బీజింగ్‌లలో దౌత్యాధికారిగా పనిచేశారు. అంతేగాక 2017 సెప్టెంబర్ నుంచి 2020 డిసెంబర్ వరకు రావత్ ఇండోనేషియా, తైమూర్ లెస్తే దేశాల్లో భారత రాయబారిగా కూడా సేవలందించారు. ఆయన చైనా భాషను అనర్గలంగా మాట్లాడగలరు.

# శివారు ప్రాంతాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
## -అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్




కరీంనగర్ డిసెంబర్ 20 (నేటినిజం ప్రతినిధి): శివారు ప్రాంతాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ అడిషనల్ డిసిపి(పరిపాలన)జి చంద్రమోహన్ అన్నారు. శివారు ప్రాంతాల్లో అక్రమ,అసాంఘీక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్నందున నూతన వ్యక్తుల కదలికలు ఉన్నట్లైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు.

కరీంనగర్ పోలీస్ కమీషనర్ వి సత్యనారాయణ ఆదేశాల మేరకు పోలీసులు సోమవారం నాడు కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హనుమాన్‌నగర్‌లో అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్ ఆధ్వర్యంలో కార్డెన్‌అండ్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివరాలు తెలియనివారికి ఇళ్ళను అద్దెకు ఇవ్వోద్దన్నారు. ఏదైనా ప్రాంతంలో అసాంఘీక, అక్రమ కార్యకలాపాలకు పాల్పడి, ఇక్కడ తలదాచుకునేందుకు ఇతర ప్రాంతాల నుండి వ్యక్తులు వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. కొత్తగా ఇళ్ళఅద్దెకోసం వచ్చిన వివరాలతో సంబంధిత పోలీస్‌స్టేషన్ లేదా బ్లూకోల్ట్స్ బృందాలకు చెందిన పోలీసులకు వివరాలు అందజేసినట్లయితే నిమిషాల వ్యవధిలో సదరు వ్యక్తుల వివరాలను ఉచితంగా తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. వాహనాల క్రయ,విక్రయాల సందర్భంగా ఇరువర్గాలకు చెందిన వాహనదారులు వారిపేరిట చెల్లుబాటుఅయ్యే ధృవపత్రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లేనట్లయితే ఏదైనా ప్రమాదాలు, అక్రమ, అసాంఘీక కార్యకలాపాలు సదరు వాహనాలతో జరిగినట్లయితే వాహనం ఎవరిపేరిట ఉంటే వారిపైనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. నేరాల నియంత్రణ, ఛేదనకు దోహదపడే సిసి కెమెరాల ఏర్పాటుకు అన్నివర్గాల ప్రజలు స్వచ్చందంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ మధ్యకాలంలో అనేక నేర సంఘటనలను సిసి కెమెరాల ఫుటేజీల ఆధారంగా ఛేదించడం జరిగిందని వివరించారు. కొందరు అనుమానిత వ్యక్తులను ఫోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైజ్ ద్వారా తనిఖీ చేశారు.

ఉదయం 6గంటల నుండి 8గంటల వరకు ప్రతి అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధృవపత్రాలు లేని 80ద్విచక్ర వాహనాలు, మూడు కార్లు, మూడు ఆటోలు, ఆరుక్వింటాళ్ళ పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సరైన ధృవపత్రాలు కలిగిన వాహనదారులకు సదరు వాహనాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసిపి జె విజయసారధి, ఇన్స్‌పెక్టర్లు పి విజ్ఞాన్‌రావు, శశిధర్‌రెడ్డిలతో పాటు వివిధ విభాగాలకు చెందిన 100పోలీసులు పాల్గొన్నారు.

# డాబర్ చ్యవన్‌ప్రాష్‌తో మీ శీతాకాలాన్ని ఆరోగ్యవంతంగా మార్చుకోండి




హైదరాబాద్, డిసెంబర్ 20: భారత్ లో ఎందరో ఇష్టంగా ఎదురుచూసే సీజన్లలో శీతాకాలం ఒకటి. చల్లదనంతోపాటు జలుబు – దగ్గు, శ్వాసకోశ సమస్యల వంటి అనేక వ్యాధులను ఈ శీతాకాలం తీసుకురావచ్చు. సాధారణంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ చికాకులు ఎక్కువగా ఇబ్బంది పెడుతుంటాయి. వీటి బారిన పడకుండా, వ్యాధి నిరోధక శక్తి పెంచుకునేందుకు సహజాతి సహజమైన పద్ధతులు అనుసరించడం సురక్షితమైన పద్ధతి. అయితే ఎన్నో రసాయనాలతో కూడిన ఉత్పత్తులు మన చుట్టూ ఉన్నప్పుడు ఏది సురక్షితమైనదో ఎంచుకోవడం ఎంతో కష్టమైనది. ఈ కన్ఫ్యూజన్ నుంచి బయటపడేలా డాబర్ ఉత్పత్తులు ఎంతగానో తోడ్పడుతున్నాయి. ఇటువంటి శీతాకాలాలు అందమైన అనుభూతులు మిగిల్చేలా డాబర్ సంస్థ ఉత్పత్తి చ్యవన్ ప్రాష్ ఉత్తమ పరిష్కారం అని చెప్పవచ్చు. చ్యవన్‌ప్రాష్ అనేది దాదాపు 3000 సంవత్సరాల పురాతన ఉ ప్రసిద్ధ ఆయుర్వేద సూత్రీకరణ. ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి ఉపయోగించబడుతుంది. దగ్గు, జలుబు వంటి సాధారణ రోజువారీ ఇన్‌ఫెక్షన్ల నుండి రక్షణను అందించడంలో సహాయపడుతుంది. డాబర్ చ్యవన్‌ప్రాష్‌లో అనేక 'రసాయనా' మూలికలు ఉన్నాయి, ఇవి దాని ఇమ్యునోమోడ్యులేటరీ ప్రభావాల ద్వారా వివిధ రకాల ఇన్‌ఫెక్షన్‌లను నివారించడంలో సహాయపడతాయి.భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని కాపాడాలనే లక్ష్యంలో భాగంగా, డాబర్ చ్యవన్‌ప్రాష్ ఈరోజు దేశవ్యాప్తంగా నిరుపేద పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నిబద్ధతతో మెగా అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా డాబర్ చ్యవన్‌ప్రాష్ – డా. పరమేశ్వర్ అరోరా, ఓ.ఆ. (ంజ) ః.ఊ.జ. వారణాసి గోల్డ్ మెడలిస్ట్ ఉ సీనియర్ కన్సల్టెంట్ ఆయుర్వేదతో కలిసి మారుతున్న రుతువులతోపాటు సాధారణంగా పలకరించే బాక్టీరియా, వైరస్‌ల వల్ల వచ్చే జబ్బులకు వ్యతిరేకంగా పోరాడేందుకు బలమైన రోగనిరోధక వ్యవస్థను నిర్మించుకోవాల్సిన అవసరం గురించి పిల్లలకు అవగాహన కల్పించేందుకు రోగనిరోధక శక్తి అవగాహన సెషన్‌లను నిర్వహిస్తుంది. ఈరోజు హైదరాబాద్‌లో విబ్జియార్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 250 మందికి పైగా పిల్లల కోసం ప్రత్యేక సెషన్‌తో డ్రైవ్ ఫ్లాగ్ చేయబడింది. చలికాలంలో అనారోగ్యంతో పోరాడేందుకు, పిల్లల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా సెషన్ జరిగింది. ప్రాథమిక పరిశుభ్రత, పౌష్టికాహారం ద్వారా వారి రోగనిరోధక శక్తిని పెంచే మార్గాలపై కూడా పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాబర్ ఇండియా లిమిటెడ్, మార్కెటింగ్ హెడ్– హెల్త్ సప్లిమెంట్స్, శ్రీ ప్రశాంత్ అగర్వాల్ మాట్లాడుతూ, "ఊంఎఆ–19 యుగంలో, బలమైన రోగనిరోధక శక్తి ప్రతి వ్యక్తికి మునుపెన్నడూ లేనంతగా ప్రాథమిక అవసరంగా మారింది. ఉసిరి, అశ్వగంధ, గిలోయ్ తదితర 40 కంటే ఎక్కువ ఆయుర్వేద మూలికల శక్తితో డాబర్ చ్యవన్‌ప్రాష్ ఎల్లప్పుడూ అనారోగ్యాలతో పోరాడటానికి రోగనిరోధక శక్తిని పెంచడానికి నిలుస్తుంది. దీన్ని ప్రమాణీకరించడానికి, మేము – డాబర్ చ్యవన్‌ప్రాష్‌పై పెద్ద ఎత్తున, బహుళ కేంద్రీకృత, క్లినికల్ అధ్యయనాన్ని పూర్తి చేసాము. ఈ క్లినికల్ అధ్యయనం కోవిడ్–19 ఇన్‌ఫెక్షన్‌కు నివారణగా డాబర్ చ్యవన్‌ప్రాష్ ప్రయోజనకరమైన పాత్రను పోషిస్తుందని అంచనా వేసింది. డాబర్ చ్యవన్‌ప్రాష్‌ని క్రమం తప్పకుండా ఉపయోగించడం ద్వారా ఎన్నో ప్రయోజనాలున్నాయని తెలిసింది. చ్యవన్‌ప్రాష్‌ని తీసుకోని వారితో పోల్చితే, తీసుకున్న వారిలో కోవిడ్–19 ఇన్‌ఫెక్షన్ ప్రమాదాన్ని 12 రెట్లు తగ్గించవచ్చని అధ్యయన ఫలితాలు వెల్లడిస్తున్నాయి. డాబర్ చ్యవన్‌ప్రాష్‌ని రెగ్యులర్‌గా ఉపయోగించడం వల్ల, కంట్రోల్ గ్రూప్‌లోని వారితో పోల్చినప్పుడు కోవిడ్ –19 ఇన్‌ఫెక్షన్ తీవ్రత 6 రెట్లు తక్కువగా ఉందని కూడా గుర్తించబడింది" అని చెప్పారు. డాక్టర్ పరమేశ్వర్ అరోరా, ఓ.ఆ. (ఆయుర్వేద), ః.ఊ.జ., మాట్లాడుతూ "కాలానుగుణ మార్పుల సమయంలో ఆకస్మిక ఉష్ణోగ్రత వైవిధ్యం ఉంటుంది. ఇది దగ్గు, జలుబు ఉ ఫ్లూ వంటి అనారోగ్యాలకు దారి తీస్తుంది. జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలు మొదలైన వ్యాధులతో పోరాడేందుకు రోగనిరోధక శక్తిని పెంపొందించడం ఒక ప్రభావవంతమైన మార్గం. ఈ ప్రచారం కింద, డాబర్ చ్యవన్‌ప్రాష్ భారతదేశంలోని 18 నగరాలకు చెందిన ప్రముఖ ఔఊలతో చేతులు కలిపింది. అనగా వారణాసి, ప్రయాగ్‌రాజ్, లక్నో, అహ్మదాబాద్, అమృత్‌సర్, జైపూర్, భువనేశ్వర్, కోల్‌కతా, పాట్నా, ఇండోర్, రాయ్‌పూర్, పూణే, ఔరంగాబాద్, రాంచీ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై మరియు చండీగఢ్ తదితర ప్రాంతాల్లో పని చేస్తుంది. "ప్రతి భారతీయుడు 100 సంవత్సరాలకు పైగా బలమైన రోగనిరోధక శక్తిని సాధించడంలో సహాయం చేయడానికి డాబర్ చ్యవన్‌ప్రాష్ కట్టుబడి ఉంది. ఈ నిబద్ధత దిశగా ఇది ఒక ముందడుగు. ప్రతి సంవత్సరం అనేక మంది ప్రాణాలను బలిగొంటున్న చలి అలల గురించి మేము ఆందోళన చెందుతున్నాము. ఈ చొరవ ద్వారా, ఈ పిల్లలకు చ్యవన్‌ప్రాష్ అందించడంతో పాటు రోగనిరోధక శక్తి యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేయడం ద్వారా నిరుపేద పిల్లలకు రక్షణ కల్పించడానికి మేము ప్రయత్నిస్తాము" అని మిస్టర్ అగర్వాల్ జోడించారు.

# నేషనల్ క్యాడెట్ కోర్స్ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగం

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:జాతీయ క్యాడెట్ కార్ప్స్ (ఔఅఅ) నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఔఊంఎ) దేశవ్యాప్తంగా ఔఊంఎ చే రోడ్ల నిర్మాణం కోసం పునీత్ సాగర్ అభియాన్ ఇతర స్వచ్ఛతా కార్యకలాపాల సమయంలో ఔఅఅ క్యాడెట్‌లు సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించేందుకు అవగాహన ఒప్పందం (ఓూజ)పై సంతకం చేశాయి. పర్యావరణ భద్రతకు అనుకూలమైన పరిస్థితులను ప్రోత్సహించడానికి, సృష్టించడానికి, ఔఅఅ సముద్ర తీరాలు/బీచ్‌ల నుంచి వ్యర్థాలను తొలగించి, ప్లాస్టిక్ వ్యర్థాలు లేని సముద్ర తీరాలను చూడడం గురించి అవగాహన పెంచడానికి పునీత్ సాగర్ అభియాన్ అనే దేశవ్యాప్త ప్రచారాన్ని ప్రారంభించింది.

స్థానిక జనాభాలో భవిష్యత్ తరాలలో 'పరిశుభ్రమైన సముద్ర తీరాలు/బీచ్‌ల ప్రాముఖ్యత' అనే సందేశాన్ని ప్రచారం చేయడం ఈ ప్రచారం లక్ష్యం. 127 కోస్టల్ ఏరియా ఎన్‌సిసి యూనిట్‌ల నుండి మొత్తం 3,40,000 మంది క్యాడెట్‌లు నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఇప్పటివరకు వివిధ ప్రదేశాలలో ఔఅఅ క్యాడెట్లు దాదాపు ఆరు టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు.

సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్డు నిర్మాణంలో ఉపయోగించడానికి ఔఊంఎకి అప్పగించాలని చూస్తున్నారు. ఔఅఅ మరియు ఔఊంఎ మధ్య అవగాహన ఒప్పందంపై 17 డిసెంబర్ 2021న డైరెక్టర్ జనరల్ ఔఅఅ లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్ ఔఊంఎ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల్ కుమార్ మిశ్రా సంతకం చేసారు.

నేషనల్ క్యాడెట్ కోర్స్ కూడా ఎమిలు ఔఎమిలు సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ లాభదాయకమైన వినియోగానికి సహకారం కోసం సంప్రదించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ ఇప్పటికే తమ సాంకేతిక నైపుణ్యాన్ని ఇందులో పంచేందుకు అంగీకరించింది. నేషనల్ క్యాడెట్ కోర్స్ కూడా ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడంలో నిమగ్నమై ఉన్న స్వచ్ఛంద సంస్థలను సంప్రదిస్తుంది, వారిలో ఒకరైన ఒడిశా యువ చేతన సంఘటన్ సహాయం అందించడానికి ఇప్పటికే అంగీకరించింది.

బీచ్‌లను శుభ్రపరచడంతో పాటు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, హాని గురించి మన సహజ వనరులకు ప్లాస్టిక్ చేస్తున్న నష్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు క్యాడెట్‌లు సామూహిక అవగాహన ప్రచారాన్ని చేపట్టారు. క్యాడెట్‌లు ప్రజలు, పర్యాటకులు, స్థానిక దుకాణదారులు/విక్రయదారులు తీరప్రాంతంలో ఉన్న మత్స్యకారులతో కూడా సంభాషిస్తున్నారు, కరపత్రాలు పంపిణీ చేయడం, ప్రజలతో ప్రమాణాలు చేయించడం, థీమ్ ఆధారిత వీధి నాటకాలు, ర్యాలీలు/ఫుట్ పెట్రోలింగ్‌లు నిర్వహిస్తూ సముద్ర తీరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను తెలియజేస్తున్నారు.. ఇప్పటి వరకు, 64 వేర్వేరు స్థానాల్లో దాదాపు 1.5 లక్షల మంది క్యాడెట్లు పునీత్ సాగర్ అభియాన్‌లో పాల్గొన్నారు. సుమారు 17 లక్షల జనాభాపై తమ ప్రభావం చూపారు.

# ధర్మేంద్ర ప్రధాన్ ఖరగ్‌పూర్ యొక్క 67వ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ, పూర్వోదయ మరియు ఆత్మనిర్భర్

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:మా నవతరం సంకల్పం, వాణిజ్య వ్యవస్థల చొరవ, విద్యాసంస్థల బలం ఫలితంగా 21వ శతాబ్దంలో భారతదేశం 130 కోట్లకు పైగా కోవిడ్ ఉపాధి అవకాశాలను అందించడం తోపాటు అనేక అద్భుత విజయాలు సాధించిందని కేంద్ర విద్య మరియు నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ఎమ ఖరగ్‌పూర్ 67వ స్నాతకోత్సవంలో అన్నారు.

శ్రీ ప్రధాన్ మాట్లాడుతూ, మనం అమృత్ మహోత్సవ్‌ను జరుపుకుంటున్న ఈ సందర్భంలో రాజ్‌గురు సహా మన స్వాతంత్ర్య సమరయోధులు, ఇంకా స్వాతంత్ర్యం కోసం పోరాడిన అనేక మంది విద్యాలయాలకి వెళ్లడం తన అదృష్టంగా భావిస్తున్నాను. ఎమి ఖరగ్‌పూర్ జాతీయ ఆవశ్యకతను గుర్తించింది ప్రారంభం నుండి భారతదేశ వృద్ధికి దోహదపడింది, అన్నారాయన.

ప్రస్తుతం మనదేశంలో 3 నుండి 23 సంవత్సరాల మధ్య వయస్సు పిల్లలు 50 కోట్లకు పైగా ఉన్నారని, ఈ జనాభాను సరైన విద్య మరియు నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం అభివృద్ధి కి అపారమైన అవకాశం అని మంత్రి పేర్కొన్నారు. విమర్శనాత్మక ఆలోచన , గుణాత్మకమైన శ్రామికశక్తి 21వ శతాబ్దంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నడపడానికి భారతదేశానికి సహాయపడుతుందని ఆయన అన్నారు.తక్కువ ఖర్చుతో కూడిన వినూత్న ప్రత్యామ్నాయ ఇంధన నమూనాలు, సెమీకండక్టర్ చిప్‌ల తయారీకి సంబంధించిన ప్రత్యేక రంగాలలో ఆవిష్కరణలు ఆర్థిక సాధికారత ఉద్యోగ కల్పనలకు దారితీయడమే కాకుండా, పూర్వోదయ (తూర్పు ప్రాంత ఉన్నతికి ఉద్దేశించిన ) స్వావలంబన భారతావనికి బాటలు పరుస్తాయని శ్రీ ప్రధాన్ వ్యక్తం చేశారు. 'ఎనర్జీ, ఇంటర్నెట్' లేకుండా జీవితాన్ని ఊహించలేమని, ప్రస్తుత కాలంలో ఈ వాస్తవాన్ని మరింత నొక్కిచెప్పారని ఆయన అన్నారు. 2035 నాటికి భారతదేశం ఇంధన వినియోగదారుల్లో మొదటి స్థానంలో ఉంటుంది. ప్రస్తుత పాలకుల వల్ల మన దేశం అత్యంత అనుకూలమైన ప్రత్యామ్నాయ ఇంధన వ్యాపార వాతావరణాన్ని కలిగి ఉందని ఆయన తెలిపారు.

# ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో పేమెంట్లు

అమరావతి, డిసెంబర్ 20:ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల పాత్ర ఉండకూడదని సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన తాడేపల్లిలోని తాన క్యాంపు కార్యాలయంలో ధాన్యం, ఇతర పంటల కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రైతుకు కనీస ఎంఎస్‌పీ ధర లభించాలన్నారు. రైతులందరికీ ఎంఎస్‌పీ రావడం అన్నది మన ప్రభుత్వ లక్ష్యమన్నారు. నాణ్యతా పరిశీలనలో రైతులు మోసాలకు గురికాకూడదని సీఎం చెప్పారు. ఇతర దేశాలకు నేరుగా ప్రభుత్వంనుంచే ఎగుమతులు చేసేలా చూడాలన్న సీఎం.. దీనివల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు.

రైతులకు సేవలందించడంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని సీఎం చెప్పారు. ఎక్కడా కూడా సమాచార లోపం ఉండకూడదన్నారు. తరచుగా రైతులతో ఇంటరాక్ట్ అవ్వాలన్న సీఎం జగన్.. రంగుమారిన, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి గతంలో ఎవ్వరూ ముందుకు వచ్చిన సందర్భాలు లేవన్నారు. రైతులకు తోడుగా నిలవడానికి చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఆ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. కొనుగోలు చేసిన 21 రోజుల్లో వారికి పేమెంట్లు అందేలా తగిన చర్యలు తీసుకోవాలన్న సీఎం.. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని పేమెంట్లు ఆలస్యం కాకుండా చూడాలి ఆదేశించారు.

కొనుగోలు కోసం ఆర్బీకేలో ఐదుగురు సిబ్బంది ఉండాలన్నారు. ధాన్యం, పంటల కొనుగోలు కోసం ప్రతి ఆర్బీకేలో కూడా కనీసంగా ఐదుగురు సిబ్బంది ఉండాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇతర సిబ్బంది ముగ్గురు కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి ఆర్బీకేలో కూడా కేటగిరితో సంబంధం లేకుండా ఐదుగురు సిబ్బంది ఉండాలన్నారు. గన్నీ బ్యాగులు, రవాణా వాహనాలు, అవసరమైన హమాలీలను ఈ ఐదుగురు సిబ్బందే ఏర్పాటు చేయాలన్నారు. రైతులు ఇబ్బందులు పడే పరిస్థితులు ఉండకూడదన్నారు.

పంటల కొనుగోలు సంబంధిత సమస్యలపై ఫిర్యాదులు, విజ్ఞాపనల కోసం ప్రతి ఆర్బీకేలో ఒక నంబర్‌ను పెట్టాలని సీఎం సూచించారు. ఆ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి రైతులు చెప్పే సమస్యలను వినాలని సీఎం ఆదేశించారు. దీనివల్ల సమస్యల తీవ్రతతో పాటు పరిష్కార మార్గాలు లభిస్తాయన్న సీఎం.. రైతులతో ఇంటరాక్షన్, నిరంతర చర్చలు అధికారులు జరపాలన్నారు. జిల్లాల్లో ఉన్న జేసీల నుంచి కూడా పంటలకొనుగోలుపై నిరంతర ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని చెప్పారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుచేసేలా వారిలో అవగాహన కల్పించాలని సీఎం జగన్ సూచించారు. పంటలు పండించే వారికి ప్రత్యేక బోనస్ ఇచ్చే అంశాన్ని అధికారులు పరిశీలించాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలు పండించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటల కొనుగోలు బాధ్యతను కూడా ప్రభుత్వమే చేపడుతుందన్న విషయాన్ని రైతులకు తెలియజేయాలని చెప్పారు. రైతులకు మంచి ఆదాయాలు కల్పన దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం జగన్ నిర్దేశించారు.

# తెలంగాణపై కక్ష్య కట్టిన కేంద్రం : మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి, డిసెంబర్ 20 తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కందుకూరు మండలం ఆకుల మైలారంలో రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి సబిత మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కేంద్రం యాసంగిలో పంట కొనుగోలు చేయమని పార్లమెంట్ సాక్షిగా ప్రకటించి తెలంగాణ రైతులకు నట్టేట ముంచుతుందని మండిపడ్డారు. రైతులు యాసంగిలో వరికి బదులు ఇతర పంటలు వేసి నష్టపోకుండా ఉండాలని సూచించారు.

ఇప్పటికే 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసింది. మరో 30 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల వద్ద ఉంది. కేంద్రం మాత్రం ఇప్పటి వరకు తీసుకుంది నామమాత్రమే అన్నారు. బీజేపీ నేతలు ఢిల్లీలో ఒక లాగా, గల్లీలో మరోలాగా మాట్లాడుతున్నారని విమర్శించారు.




తెలంగాణ రైతుల కోసం పూర్తి ధాన్యం కొనుగోలు చేసేలా ముందు కేంద్రాన్ని ఒప్పించాలి. లేదంటే బీజేపీకి తెలంగాణలో స్థానం లేకుండా చేస్తారన్నారు. రైతులకు అండగా దేశ చరిత్రలో ధర్నా చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే అన్నారు.

# ఈ-చవ్నీ' ప్రాజెక్ట్ కింద కంటోన్మెంట్ బోర్డ్ పౌరులకు జీఐఎస్ ఆధారిత ఆటోమేటిక్ నీటి సరఫరా వ్యవస్థ

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:కంటోన్మెంట్ బోర్డుల పౌరుల కోసం జీఐఎస్ ఆధారిత 'ఆటోమేటిక్ వాటర్ సప్లై సిస్టమ్' ను ఇటీవలే కేంద్ర రక్షణ శాఖ మంత్రి ప్రారంభించారు. 'డిఫెన్స్ ఎస్టేట్స్ డే 2021' సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ ఈ విధానాన్ని ప్రారంభించారు. కంటోన్మెంట్ బోర్డుల కోసం జీఐఎస్ ఆధారిత నీటి సరఫరా వ్యవస్థకు సంబంధించిన మాడ్యూల్‌ను 'భాస్కరాచార్య ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్పేస్ అప్లికేషన్స్ అండ్ జియో ఇన్ఫర్మేటిక్స్' (బీఐఎస్ఏజీ) రక్షణ శాఖ కార్యదర్శి మరియు డిఫెన్స్ ఎస్టేట్స్ డైరెక్టర్ జనరల్ మార్గదర్శకత్వంలో అభివృద్ధి చేయబడింది,

ఈ మాడ్యూల్ ఆన్‌లైన్‌లో నీటి కనెక్షన్ కోసం మంజూరును మరింత సులభతరం చేస్తుంది. సిస్టమ్ అనుమతిని జారీ చేసిన తర్వాత, కాంటో?న్మెంట్ బోర్డ్‌లోని సంబంధిత డిపార్ట్‌మెంట్ ఇచ్చిన సమయ వ్యవధిలో అసలు నీటి కనెక్షన్‌ని నిర్ధారిస్తుంది. ఈ విధానం వాడకందారులకు అత్యంత సానుకూలంగా, సమర్థవంతంగా మరియు పారదర్శకంగా ఉంటుంది.

జీఐఎస్ ఆధారిత నీటి సరఫరా వ్యవస్థ దేశంలోనే మొట్టమొదటిది. ఇది "కనీస ప్రభుత్వం జోక్యంపై ఆధారపడింది మరియు నీటి కనెక్షన్ యొక్క క్లియరెన్స్/ మంజూరీ కోసం వ్యక్తుల జోక్యం లేనందున "గరిష్ట పాలన" భావనకు మద్దతునిస్తుంది. సాంప్రదాయ నీటి సరఫరా వ్యవస్థలో, పౌరులు స్థానిక సంస్థలకు దరఖాస్తు చేస్తారు.

ఆ తరువాత దరఖాస్తు ప్రాసెస్ చేయబడుతుంది, దీనికి చాలా సమయం పడుతుంది. ఛార్జీలు ఆఫ్‌లైన్‌లో జమ చేయాల్సి ఉంటుంది. నీటి కనెక్షన్ మంజూరు చేసేందుకు గాను ఎటువంటి కాల వ్యవధి నిర్వచించబడలేదు. బీఐఎస్ఏజీ జీఐఎస్ మాడ్యూల్‌ని విజయవంతంగా అమలు చేసింది. ఈ –చవ్నీ పోర్టల్‌తో ఈ వ్యవస్థను భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) ఏకీకరణను చేసింది. 'డిఫెన్స్ ఎస్టేట్స్ డే'ను డిసెంబర్ 16, 2021న డిఫెన్స్ ఎస్టేట్స్ డైరెక్టర్ జనరల్ జరుపుకున్నారు.

# వీఆర్ లో ఉన్న 25 మంది పోలీసు సిబ్బంది బదిలీ

గుంటూరు ,డిసెంబర్ 20:: వీఆర్ లో ఉన్న 25 మంది పోలీసు సిబ్బంది బదిలీ అయ్యారు. వీఆర్ లో ఉన్న పోలీసులను పోలీస్ స్టేషన్లకు రూరల్ ఎస్పీ విశాల్ గున్ని బదిలీ చేశారు. సోమవారం గుంటూరు రూరల్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించిన సమావేశంలో వీఆర్ లో ఉన్న పోలీసులతో మాట్లాడిన రూరల్ ఎస్పీ విశాల్ గున్నీ.. వీఆర్ కి రావడానికి గల కారణాలను తెలుసుకుని, ఇక నుండి సత్ప్రవర్తన కలిగి విధులు నిర్వర్తించాలని తెలిపారు. వీఆర్ లో ఉన్న మొత్తం 25మంది.. ఇద్దరు ఏఎస్ఐ, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 9 మంది కానిస్టేబుళ్లకు వారు కోరుకున్న విధంగా, పోలీస్ స్టేషన్లలో ఉన్న ఖాళీల ఆధారంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు భిక్ష



మంచిర్యాల, డిసెంబర్ 20:: మతసామరస్యానికి ప్రతీక తెలంగాణ. వందల ఏండ్లుగా ఈ గడ్డపై హిందూ, ముస్లింలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటూ మత సామరస్యాన్ని చాటుతున్నారు. తాజాగా జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీలోని రామకృష్ణాపూర్ శ్రీ విజయ గణపతి దేవాలయంలో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా రామకృష్ణాపూర్ ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. గత మూడ సంవత్సరాలుగా అయ్యప్ప దీక్ష తీసుకున్న స్వాములకు భోజన ప్రసాదాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హిందూ, ముస్లిం భాయ్ బాయి అనే సోదరభావంతో ఇలాంటి కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు.

అనంతరం గురుస్వామి రంగచారి మాట్లాడుతూ.. భిక్ష ఏర్పాటు చేసిన ముస్లిం సోదరులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి సంవత్సరం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసి మత సామరస్యం చాటుతామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ సభ్యులు ఖాజా, సలీమ్, పాషా, షఫీ, ఆరిఫ్, ఇమ్రాన్, మోహిద్, ఇందాస్, కలీమ్, గౌస్, ఇమామ్ అజ్గర్ ఆలీ, ముఖ్య అతిథిగా క్యాతనపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎర్రం విద్యా సాగర్ రెడ్డి, యువత జనం కోసం అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేష్, యువ నాయకులు రామగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నిర్లక్ష్యం వల్లే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ: పవన్ కల్యాణ్

విజయవాడ, డిసెంబర్ 20:: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ఏపీలోని వైఎస్ జగన్ ప్రభుత్వంపై జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఒంటికాలుపై లేచాడు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే కేంద్ర ప్రభుత్వం వీఎస్‌పీ ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకున్నదని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన ట్విట్టర్ వేదికగా వైసీపీ ప్రభుత్వాన్ని మరోసారి తూర్పారబట్టారు. విశాఖ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా స్టీల్ ప్లాంట్ కోసం ప్రాణత్యాగం చేస్తామని అధికార పార్టీ చేసిన నినాదాన్ని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ గుర్తుచేశారు.

'విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ– స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ప్రాణ త్యాగాలు చేసైనా సరే అడ్డుకుంటాం అని చెప్పారు. అంత త్యాగాలు అక్కర్లేదు. కనీసం ప్లకార్డులు పట్టుకోండి చాలు' అంటూ వైసీపీ ఎంపీలకు పవన్ కల్యాణ్ చురకలంటించారు. అంతకుముందు, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పోరాటానికి సంబంధించి పార్లమెంట్‌లో ప్ల కార్డులు ప్రదర్శించాలని వైసీపీ, టీడీపీ ఎంపీలకు విజ్ఞప్తి చేస్తూ వీడియో ఒకదాన్ని ఆయన విడుదల చేశారు. అఖిలపక్షాన్ని ప్రభుత్వం ఢిల్లీకి తీసుకెళ్తే మద్దతుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రజల వాణిని పార్లమెంటుకు తీసుకెళ్లాలని వైసీపీ ఎంపీలను డిమాండ్ చేశారు.

# కొవిడ్ ప్రోటోకాల్స్ ఉల్లంఘిస్తే ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : మేయర్

ముంబై, డిసెంబర్ 20:: కరోనా మహమ్మారి మొదటి, సెకండ్ వేవ్‌లో మహారాష్ట్రపై విరుచుకుపడింది. ఇటీవల దక్షిణాఫ్రికాలో వెలుగు చూసిన కొత్త వేరియంట్ ఒమిక్రాన్ సైతం దేశంలో మహారాష్ట్రలోనే ప్రభావం చూపుతున్నది. ఇప్పటి వరకు 50కిపైగా కొత్త కేసులు నమోదయ్యాయి. వైరస్ వేగంగా వ్యాప్తిచెందుతుందన్న ఆందోళన మధ్య బీఎంసీ రాబోయే క్రిస్మస్ పండుగ, నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోటోకాల్ జారీ చేసింది. అలాగే పార్టీలకు దూరంగా ఉండాలని పౌరులకు విజ్ఞప్తి చేసింది.

నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది. ఈ సందర్భంగా ముంబై మేయర్ కిశోరీ పడ్నేకర్ మాట్లాడుతూ బీఎంసీ, ముంబై పోలీసులు జారీ చేసిన కొవిడ్ ప్రోటోకాల్స్‌ను పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వేడుకలపై నిషేధం విధించే ఆలోచన లేదన్నారు. ప్రజలంతా తప్పక నిబంధనలు పాటించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. దేశంలో ఇప్పటి వరకు ఒమిక్రాన్ పాజిటివ్ కేసులు నమోదవగా.. ఇందులో 54 మహారాష్ట్రలోనే ఉన్నాయి. వీటిలో 22 ముంబై మహానగరంలోనే రికార్డయ్యాయి.

బీఎంసీ కమిషనర్ చాహల్ ఆదివారం మాట్లాడుతూ ఒమిక్రాన్ వ్యాప్తి నేపథ్యంలో చాలా దేశాల్లో పరిస్థితి అదుపు తప్పిందని, మరోసారి లాక్‌డౌన్ పరిస్థితి తలెత్తిందన్నారు. మూడో వేవ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం, అధికారులు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా చాలా చోట్ల వివాహ వేడుకలు, ఇతర కార్యక్రమాల్లో మార్గదర్శకాలు సరిగ్గా పాటించడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకునేందుకు బీఎంసీ బాడీ వార్డుస్థాయిలో ప్రత్యేక బృందాలను నియమించినట్లు చెప్పారు. అలాగే పోలీస్ అధికారులు సైతం నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తారని కమిషనర్ వివరించారు.

# రాఫెల్ నాదల్‌కు కరోనా పాజిటివ్

మాడ్రిడ్, డిసెంబర్ 20:: ప్రముఖ టెన్నిస్ ఆటగాడు రాఫెల్ నాదల్ కరోనా బారినపడ్డాడు. ఇటీవల అబుదాబిలో జరిగిన ఎగ్జిబిషన్ ఈవెంట్‌లో పాల్గొన్నాడు. తర్వాత స్పెయిన్‌కు చేరుకున్న అనంతరం సోమవారం కొవిడ్ ఆర్టీ పీసీఆర్ పరీక్షలు చేయగా.. ఫలితాల్లో పాజిటివ్‌గా వచ్చిందని సోమవారం నాదల్ ప్రకటించాడు. 'నేను కొన్ని బాధాకరమైన క్షణాలను కలిగి ఉన్నాను. దీంట్లో నుంచి మెరుగుపడతానని ఆశిస్తున్నాను. నేను ఇప్పుడు స్వదేశానికి చేరుకున్నాను. నాతో క్లోజ్‌గా ఉన్నవారంతా దయచేసి టెస్టులు చేయించుకోండి' అంటూ సూచించాడు.

ఈ సందర్భంగా వచ్చే నెలలో ప్రారంభమయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలో పాల్గొనడంపై సందేహం వ్యక్తం చేశాడు. మెల్‌బోర్న్‌లో జరిగే టోర్నీకి అందుబాటులో ఉండేది లేనిది ఖచ్చితంగా తెలియదని చెప్పాడు. తను భవిష్యత్‌లో పాల్గొనే టోర్నమెంట్లు, నిర్ణయాలపై అభిమానులకు తెలియజేస్తానని, తనకు మద్దతు తెలిపిన వారందరికీ ధన్యవాదాలు తెలిపాడు.



# దళిత కుటుంబానికి అండగా ఉంటా-డాక్టర్ గోలి మోహన్



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 20 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ నియోజకవర్గం కోనరావుపేట(గ్రామము లో ఇటీవల బహరేన్ లో మరణించిన బొల్లిరాజయ్య మృతదేహన్నిస్వదేశానికితెపించి ఆదివారం వారి కుటుంబాన్ని అధ్యగోలి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గోలి మోహన్ పరామర్శించి, దళితకుటుంబానికిఅండగాఉ ంటాను అని భరోసా ఇచ్చారు. ఆధ్యగోలి ఫౌండేషన్ ద్వారా విద్య వైద్యము , రైతు కు సహకారము , పేద ప్రజలకు అండగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ వేములవాడ నియోజక వర్గ అభివృధికి తోడ్పడుతాను అన్నారు ఈ కార్యక్రమము లో గ్రామాసర్పంచ్ రేఖ కోనరావుపేట ఎంపీటీసీ చారి, రాజన్నసిరిసిల్లజిల్లామున్నూరుకాపుఅధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ ఆద్యగోలి ఫౌండేషన్

# అనాథలకు అండగా మంత్రి



గొల్లపల్లి, డిసెంబర్ 20 : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వకోడూర్‌కు చెందిన ఇద్దరు అనాథ చిన్నారులైన నాలుగేండ్ల అన న్య, రెండేండ్ల విశాల్‌ను ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అక్కున చేర్చుకొన్నారు. వారి దీనస్థితిని చూసి చలించిపోయిన ఆయన అండగా నిలిచారు. చిన్నారుల తల్లి సుంకె లత ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. మద్యానికి బానిసైన తండ్రి పిల్లల పోషణను పట్టించుకోకపోవడంతో ఆ చిన్నారులను వృద్ధురాలైన నానమ్మ పోచమల్లవ్వ చేరదీసింది. మంత్రి ఈశ్వర్ ఆదివారం చిల్వకోడూర్ పర్యటనలో భాగంగా వీరి పరిస్థితిని తెలుసుకున్నారు. చిన్నారుల పోషణకు ఎల్‌ఎం కొప్పుల చారిటబుల్ ట్రస్టు నుంచి ప్రతి నెలా రూ.5 వేలు అందజేస్తామని హామీ ఇచ్చారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 20 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి లో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కొమ్ము సాంబయ్య కుటుంబ సభ్యులను సోమవారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్,తెరాస సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డిపరామర్శించి తన ప్రగాఢ సానుభూతినితెలియజేశారు..మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మన కళ్ల ముందే ఉన్న వ్యక్తులు అకస్మాత్తుగా మరణించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వారు భౌతికంగా మన మధ్యన లేక పోయినా వారి జ్ఞాపకాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని మనో ధైర్యాన్ని ఇచ్చారు.మనోహర్ రెడ్డి వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్అంజన్ కుమార్, మండల టీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు సోమినేని బాలు, గ్రామ శాఖ అధ్యక్షుడు పెండ్యాల శంకర్, సుంకపాక శంకర్ తదితరులు ఉన్నారు.

# చందుర్తి లో టిఆర్ఎస్ ఆందోళన- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 20 (నేటినిజం ప్రతినిధి):యాసంగిలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయమని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ చందుర్తి మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేకల ఎల్లయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తూ ఉంటే తెలంగాణలో పండించిన ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయమని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నాల శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దఎత్తున ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టగా పెద్దఎత్తున వరి సాగు చేస్తుండగా కేంద్రం ధాన్యాన్ని కొనక పోవడం మంచి పద్ధతి కాదన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేంత వరకూ ఆందోళన చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్ టిఆర్ఎస్ నాయకులు మరాటి మల్లిక్. కమలాకర్ రావు. బైరగోని రమేష్. లింగాల మల్లయ్య. సంటి బాబురావు. రమేష్ రావు. వ్యాఖ్యల పరశురాములు. కొండ లక్ష్మణ్.మల్యాల గంగ నరసయ్య. బత్తుల కమలాకర్. పోతరాజు నగేష్ తదితరులు పాల్గొన్నారు,

# నైపుణ్యాల అభివృద్ధి ద్వారా స్వయం ఉపాధి : మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్, డిసెంబర్ 20:: చదువుకున్న నిరుద్యోగ యువతకు వివిధ వృత్తులలో నైపుణ్యాలు అభివృద్ధి చేయడం ద్వారా వారు స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుంది. అందు కోసం జిల్లా కేంద్రంలో శాశ్వతంగా స్వయం ఉపాధి, అభివృద్ధి, శిక్షణ కేంద్రం భవన నిర్మాణాన్ని చేపడతామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

సోమవారం ఆయన జిల్లా పరిషత్ మైదానంలో జిల్లా యువజన సర్వీసుల శాఖ ద్వారా వివిధ కోర్సులలో శిక్షణ పొందిన 96 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, ఫ్రిడ్జ్ మెకానిక్, మొబైల్ సర్వీసింగ్, కేబుల్ టీవీ ఇన్‌స్టాలేషన్, డొమెస్టిక్ ఎలక్ట్రీషన్‌ల్లో మూడు నెలల పాటు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..చదువుకున్నవారికి వారి నైపుణ్యాలను అభివృద్ధి పరిచేలా తమ శాఖ పరిధిలో ఉన్న యువజన సర్వీసుల శాఖ ద్వారా ఉచితంగా శిక్షణ ఇప్పించి వారు జీవితంలో స్థిరపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని స్కిల్ డెవలప్ మెంట్ ట్రైనింగ్ సెంటర్ కోసం ఒక మంచి భవనాన్ని నిర్మించి అక్కడ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని కౌన్సిలర్లు, సర్పంచులు చదువుకున్న నిరుద్యోగులను గుర్తించి వారు ఆయా కోర్సుల ద్వారా శిక్షణ పొందేలా అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

హైదరాబాద్, డిసెంబర్ 20: కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని కేంద్రంలో బీజేపీ నాయకులు చెప్పేది ఒకటి.. రాష్ట్ర బీజేపీ నాయకులు చెప్పేది మరొకటని బీజేపీ బూటకపు మాటలు నమ్మి రైతులు మోసపోకుండా యాసంగిలో వరి పంటకు బదులుగా ప్రత్యామ్నయ పంటలు పండించి లబ్ధి పొందాలని పేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని భైరంకొండ, పేరపళ్ల, జాజాపూర్ గ్రామాల్లో రూ. 22 లక్షలతో నిర్మించిన రైతు వేదిక భవనాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉండగా చేతులెత్తేయడం సిగ్గు చేటన్నారు. వానకాలంలో పండించిన పంటలను కొనుగోలు చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం మాట తప్పకుండా చివరి గింజ వరకు కొనుగోలు చేసిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రాక ముందు ఎరువులు, విత్తనాల కోసం రైతులు పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాల్లో చెప్పులు పెట్టి నిరీక్షించిన పరిస్థితి ఉండేదన్నారు.ప్రస్తుతంసీఎం కేసీఆర్ ప్రభుత్వం రైతులకు సమస్యలు లేకుండా ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతుబంధు ఇస్తున్నదన్నారు.రైతు కుటుంబంలో రైతు చనిపోతే 5 లక్షలు ఇచ్చి అండగా నిలుస్తుందన్నారు. రైతుల మేలు కోసం 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్ రైతు వేదికను నిర్మించి రైతులకు అవగాహన కార్యక్రమం చేపడుతుందన్నారు. ఎమ్మెల్యే సీడీపీ నిధులతో రైతు వేదికల్లో కంప్యూటర్, ప్రొజెక్టర్, ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించబడుతుందన్నారు. కేంద్రం వరి కొనుగోలు చేయమని చెప్తే బీజేపీ రాష్ట్ర నాయకులు వరి వేయమని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి యాసంగిలో కొనుగోలు కేంద్రాలు ఉండవు కాబట్టి ప్రత్యామ్నయ పంటలు పండించాలన్నారు.

మండలంలోని భైరంకొండ,పేరపళ్ల రైతు వేదిక భవనాలపై ప్రధాని మోదీ బొమ్మలను తొలగించారని ఆరో పిస్తూ బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు నిరసన వ్యక్తం చేయ డంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు వేదికల్లో కేంద్ర ప్రభుత్వం నిధులున్నాయనడం బీజేపీ నాయకుల మూర్ఖత్వమని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి 100 శాతం ట్యాక్సుల రూపంలో చెల్లిస్తే దానిలో రాష్ట్రాలకు 41 శాతం మాత్రమే కేంద్రం ఇస్తుందని విషయం తెలియకుండా బీజేపీ నాయకులు వ్యవహరిస్తూ అధికార పార్టీ నాయకుల సహనాన్ని దెబ్బ తీస్తున్నారన్నారు. రైతుల పక్షాన ప్రభుత్వం ఎప్పటికీ ఉంటుందని, ఎవరైనా రైతుల జోలికివస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. అనంతరం జాజాపూర్‌లోని రైతు వేదిక వద్ద మొక్క నాటారు.

కార్యక్రమంలో సర్పంచులు నర్సింహులు, శ్రీదేవిరవీందర్‌గౌడ్, సుగంధమ్మజగన్మోహన్‌రెడ్డి, ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ అంజలి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు వెంకట్రాములుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ సుగుణ, ఎంపీటీసీలు శేఖర్, సుభద్రమ్మ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కన్నా జగదీశ్, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, ఏవో నాగరాజు, ఎఈఓలు, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేపూరి రాము లు, రైతు బంధు జిల్లా సభ్యుడు కోట్ల జగన్మోహన్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతు బంధు గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

# రైతు బాగుపడాలంటే బీజేపీ గద్దె దిగాల్సిందే : మంత్రి హరీశ్‌రావు




సిద్దిపేట, డిసెంబర్ 20:: రైతు బాగుపడాలంటే బీజేపీ గద్దే దిగాల్సిందేనని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. మోదీ ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని కేంద్రం తీరుపై మంత్రి నిప్పులు చెరిగారు. గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ పిలుపు మేరకు.. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు.

వడ్లు కొనకుండా బీజేపీ రాజకీయ కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ గ్రామాన బీజేపీ నేతలను నిలదీయాలి. వడ్లు కొంటరా..కొనరా అని ప్రశ్నించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణకు బీజేపీ చేసిందేంటి ? రైతుల కోసం సీఎం చేయాల్సింది చేశారన్నారు.

పంట కొనుగోలుపై చేతులెత్తేసిన కేంద్రం..

పంట కొనాల్సిన కేంద్రం చేతులెత్తేస్తోందని బీజేపీపై మండిపడ్డారు. పంటలు పండిన చోట ధాన్యాన్ని కొని, పండని చోట, ప్రకృతి విలయాలు ఏర్పడిన చోట ప్రజలకు అవసరమైన ధాన్యాన్ని అందుబాటులో ఉంచడం కేంద్ర ప్రభుత్వ విధి. పంటలు పండించడం రాష్ట్రం బాధ్యత, దాన్ని కొనే బాధ్యత కేంద్రానిదని స్పష్టం చేశారు.

సీఎం కేసీఆర్ పాలనలో కరెంట్ కష్టాలు తొలిగిపోయాయన్నారు. టీఆర్ఎస్ గవర్నమెంట్ వచ్చాక ఇప్పటికే 50 వేల కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా నగదుగా ఇచ్చాం. పెట్టుబడి సాయంగా ఇచ్చాం. అప్పుగా కాదన్నారు. రైతుల కోసం ఎంతో చేస్తుంటే రైతు ఆగం కావాలే అని బీజేపీ కోరుకుంటోంది. ఆ కోపం టీఆర్ఎస్ మీదవస్తే రాజకీయంగా లబ్ధి పొందుదామని కుట్ర పన్నుతున్నరని వారి కురుచ బుద్ధిని ఎండగట్టారు.

కేంద్రం కొనదు కాక కొనదు..

సీడ్ కంపెనీలు ఇస్తే వడ్లు వేసుకోండి, తినడానికి వేసుకోండి, మిల్లర్లుకు అవసరమైతే వడ్లు వేసుకోమని సీఎం చెప్పిండ్రు. ఎందుకంటే కేంద్రం కొనదు కనుక. అందుకే సీఎం కేసీఆర్ రైతు నష్టపోవద్దని ప్రత్నామ్నాయ పంటలు వేయండని కోరారు. కొనుగోలు కేంద్రాలు ఉండవని చెప్పారు.

కిషన్ రెడ్డి రైతు మీద ప్రేమ ఉంటే మీ ప్రధానిని ఒప్పించి యాసంగిలో వడ్లు కొంటవా కొనవా..అది చెప్పు ముందు అని నిలదీశారు. కొనిపించి మాట్లాడుతప్ప నీ సొల్లు పురాణం ఎవరూ వినరన్నారు. తెలంగాణలో పండేదే బాయిల్డ్ రైస్. ఎండ కాలం వేడిఎక్కువ కనుక రా రైస్ ఇక్కడ నడవదు. నూకలయితది. ఇంత కాలం అమ్మింది అదే..కేంద్రం కొన్నది అదే. ఎందుకు కొనవో చెప్పు అని సూటిగా ప్రశ్నించారు.

బీజేపీ ఏం ఇచ్చింది తెలంగాణకు. బీజేపీ నేతలను అడగాలే. ఏడు మండలాలు తీసి ఏపీలో కలిపిండ్రు. లోయర్ సీలేరు పవర్ ప్లాంట్ ను ఆంధ్రాకు ఇచ్చిండ్రు. బయ్యారం ప్రాజెక్టు లేదు. సింగరేణి బొగ్గు బ్లాకులు ప్రయివేటు వారికి అప్పజెప్తున్నరు. గిరిజన యూనివర్సిటీ ఇస్తమని ఎగబెట్టింది బీజేపీ పార్టీ. రైతు వ్యతిరేక బీజేపీకి గుణ పాఠం చెప్పాలన్నారు.

బీజేపీ రైతుల ఉసురు పోసుకుని కార్పొరేట్ వర్గాలకు లాభం చేస్తోంది. బడా బడా కంపెనీలకు కొమ్ము కాస్తుంది. రైస్ ను ఎక్స్ పోర్టు చేయి. కొంత రైతుల కోసం భరించు. వేం భరిస్తలేమా.. అని ప్రశ్నించారు. లక్షల కోట్లు కార్పొరేట్ వర్గాలకు ఇవ్వడానికి చేతులు వస్తాయి కాని, రైతులకు ఇవ్వడానికి చేతులు రావడంలేదని మండిపడ్డారు. కేంద్రం రాష్ట్రంలో చిచ్చు పెట్టాలని చూస్తోంది.

రైతులను దూరం చేయాలని కుట్ర చేస్తోంది. ఈ కుట్రను తిప్పికొట్టాలి. ఈ బాధ్యత మనదే అన్నారు. మధ్యప్రదేశ్ లో బీజేపీ సీఎం ఉన్నరు. అక్కడ ఎల్లిగడ్డను అక్కడి రైతులు రోడ్డు మీద పోసి అంటుపెట్టి నిరసన వ్యక్తం చేశారు. దీనికి సమాధానం చెప్తరా..బట్టె బాజ్, జూటే బాజ్ మాటలు మాట్లాడతరు బీజేపీ వాళ్లు. అక్కడ ఎందుకు కొనలేదు. ఇక్కడ బీజేపీ నేతలు పెద్ద మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు.

మంత్రి కిషన్ రెడ్డికి దమ్ముంటే, రైతుల మీద ప్రేమ ఉంటేనీ ఢిల్లీని ఒప్పించు. రాజకీయాలు చేస్తామంటే నడవదు. ఎక్కడకు వచ్చినా బీజేపీ నేతలను నిలదీయాలి. ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఉండగ మోటర్లు కాలో, నీళ్లు లేక, బోరు ఎండిపోతే.. రైతు చనిపోతే కాంగ్రెసోళ్లు ఎక్స్ గ్రేషియా ఇచ్చినరా ఆనాడు ఇవాళపెద్దగా మొత్తు కుంటున్నరు.

టీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఒక్కొక్కరికి ఐదు లక్షలు చనిపోతే రైతు బీమా ఇచ్చిందన్నారు.

బీజేపీ వాళ్లు కొంటామంటే మనం వద్దు అంటున్నమా..జూటా ప్రచారం గొంతు పెద్దగా చేసి మాట్లాడతున్నారు. గ్యాస్, పెట్రోల్, డిజీల్ ధరలు పెంచి నడ్డి పేదల విరుచుడు తప్ప ఏం చేసిండ్రు అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కుమారుడు రైతుల మీద కారు ఎక్కిస్తే అరెస్టు చేయలే మీరా రైతులు కోసం మాట్లాడేదని ఘటుగా విమర్శించారు.

రైతుల బతుకు బాగవ్వాలంటే బీజేపీని దించాల్సిందే. ఎరువుల ధర పెంచారు. బాయిల కాడ మీటర్లు పెడతామంటారు. జీఎస్టీ మల్ల. ఇలా చేస్తే రైతులు బాగుపడతరా.. రైతులు బాగుపడాలంటే బీజేపీ గద్దె దిగాల్సిందే. అందుకు పోరాటం చేద్దామని మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

# ప్లాస్టిక్ ఉత్పత్తి పరిశ్రమల మూసివేత

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:తక్కువ వినియోగం, చెత్త ఎక్కువగా పోగుచేసే అవకాశం ఎక్కువ ఉన్న ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులను 2022 నాటికి గుర్తించి నిషేధిస్తూ 12 ఆగస్టు 2021న ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ సవరణ నియమాలను మంత్రిత్వ శాఖ జారీ చేసింది.

ప్లాస్టిక్ క్యారీ బ్యాకుల విషయానికి సంబంధించి, ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ సవరణ నియమాలు, 2021, వాటి ఉత్పత్తి, దిగుమతి, నిల్వలు, పంపిణీ, అమ్మకాలను, డెబ్బై ఐదు మైక్రాన్ల మందంకన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగాన్ని 30 సెప్టెంబర్, 2021 నుంచి నిషేధించింది, ఇక నూట ఇరవై ఐదు మైక్రాన్లకన్నా తక్కువ మందం ఉన్న వాటిని 31 డిసెంబర్, 2022 వరకూ మాత్రమే వినియోగించవచ్చని పేర్కొంది. అంతేకాకుండా, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నియమాలు, 2016ను సవరణకు అనుగుణంగా, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను లేదా గుర్తించిన ఒకసారి మాత్రమే వినియోగించదగిన ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా లేదా పాక్షికంగా నిషేధించేందుకు నిబంధనలను ప్రవేశపెట్టేందుకు 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఉత్తర్వులను, ప్రకటనలను జారీ చేశాయి.

కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు తన నివేదిక, లక్నో చెత్తకుప్పలు వేసే ప్రాంతంలో మట్టి, జల నాణ్యతపై ప్లాస్టిక్ వ్యర్థాల విసర్జన ప్రభావం లో, వివిధ వర్గాల ప్లాస్టిక్ ఉత్పత్తులలో ఉండే బ్లీచింగ్ సంకలితాలు, రంగులు, స్టెబిలైజర్లు (స్థిరీకరణలు), పూరకపదార్థాల కారణంగా ప్లాస్టిక్ వ్యర్థాలను కుప్పగా విసర్జించడం అన్నది మట్టి నాణ్యతను క్షీణింపచేయడమే కాక, భూగర్భ జల నాణ్యతను కూడా ప్రభావితం చేస్తుందని పేర్కొంది.

ఈ సమాచారాన్ని లోక్‌సభలో నేడు అడిగిన ఒక ప్రశ్నకు పర్యావరణ, అడవులు, పర్యావరణ మార్పుశాఖ మంత్రి అశ్విని కుమార్ చౌబె సమాధానమిస్తూ వెల్లడించారు.

# ప్రధాన నగరాలకు దీటుగా హోమ్ టౌన్ ఫ్యామిలీ రెస్టారెంట్ : ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 20 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలో నూతనంగా ప్రారంభిస్తున్న హోమ్ టౌన్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను సోమవారం రోజున వేములవాడ శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు సందర్శించారు. ఈ సందర్భంగా హోమ్ టౌన్ రెస్టారెంట్ నిర్వాహకులైన మొట్టల మహేష్ కుమార్, వినయ్ లను అభినందిస్తూ టెంపుల్ సిటీ వేములవాడ పట్టణంలో అత్యాధునిక హంగులతో మెట్రో కల్చర్ ప్రతిబింబించేలా ఏర్పాటు చేయడం పట్ల సంతృప్తిని సంతోషాన్ని వ్యక్తం చేశారు. యువత నేటితరం ఆలోచనలకు అనుగుణంగా ప్రజల నాడిని తెలుసుకొని వ్యాపారాలు ప్రారంభించడం స్వాగతిస్తున్నా అని అన్నారు.హోమ్ టౌన్ ఫ్యామిలీ రెస్టారెంటు దినదిన అభివృద్ధి సాధించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఆయన వెంట వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి రాజు , వేములవాడ అర్బన్ ఎంపీపీ బుర్ర వజ్రమ్మ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమాన్లు ,టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పుల్కం రాజు రాజు ,కౌన్సిలర్లు ఉన్నారు.

# గుజరాత్‌లోని ఎనిమిది నగరాల్లో నైట్‌కర్ఫ్యూ

అహ్మదాబాద్, డిసెంబర్ 20: కరోనా కొత్త వేరియంట్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో గుజరాత్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే రాష్ట్రంలో కొత్త వేరియంట్ కేసులు 11 నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఎనిమిది ప్రధాన నగరాల్లో నైట్ కర్ఫ్యూ విధించింది. సోమవారం రాష్ట్రంలో కరోనా పరిస్థితులపై ప్రభుత్వం సమీక్షించింది. ఈ సందర్భంగా అహ్మదాబాద్, వడోదర, సూరత్, రాజ్‌కోట్ సహా ఎనిమిది నగరాల్లో నైట్ కర్ఫ్యూను ఈ నెల 31 వరకు విధించింది. ఆయా నగరాల్లో రాత్రి ఒంటి గంట ఉదయం 5 గంటల వరకు నైట్ కర్ఫ్యూ అమలులో ఉండనున్నది. ఈ మేరకు గుజరాత్ హోంమంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

# వరి , చిరు ధాన్యాలకు కనీస మద్దతు ధర ప్రకటించండి

**– నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చెన్నమనేనిరమేష్ బాబు .!**



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 20 (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్రంలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు అందించి రైతుల అభ్యున్నతికి కృషి చేసి పంటలు సమృద్ధిగా పండే తరుణంలో కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహించాలిసింది పోయి పంటను కొనము అనే మొండి వైఖరి చాలా దురదృష్టకరమని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు బాబు అన్నారు.టీఆర్ఎస్ పార్టీ ఆదేశాల అనుసారం వేములవాడ మేడిపెల్లి పట్టణ కేంద్రంలో టీఆర్ఎస్ పార్టీ ఆదేశాల అనుసారం వేములవాడ, మేడిపెల్లి మండల కేంద్రాల్లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే రమేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ ఇది తెలంగాణ రైతుల పట్ల గొడ్డలి పెట్టు ఇది తెలంగాణ వ్యవసాయ రంగం పైననే ప్రభావం చూపుతుంది కాబట్టి అట్టి నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలి అలా కాకపోతే ఇది ప్రారంభం మాత్రమే మా ముఖ్యమంత్రి కరాకండిగా చెప్పారు ఇకపై రైతుల దగ్గరకే వెళ్లి రైతుల ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చి పంటను కొనే వరకు వదిలేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేసారు. మొన్న ఆ చట్టాలను ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల వలన వెనక్కి తీసుకున్నారు లేకపోతే మీకు ప్రజలు రాజకీయ గోరీ కట్టడం కాయం అదే పరిస్థితి వస్తది ఎందుకంటే 2014లో అధికారంలో ఉండి నేటి వరకు రైతుల అభ్యున్నతి కొరకు ఒక్క పథకం కానీ ఒక్క చట్టం కానీ చేయకపోగా పాత చట్టాలు అంటే మద్దతు ధర కావచ్చు ఇతరత్రా సబ్సిడీలు తీసివేయడం చాలా బాధాకరం అంతేకాకుండా లక్షల కోట్ల దేశ సంపదను అంబానీ, ఆదానీ లకు కట్టబెట్టడం దేశద్రోహం కిందకే వస్తుందని ఎందుకంటే ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలు ఎల్.ఐ.సి, విమానాశ్రయాలు,పోర్టులు, రైల్వేలు, ఉక్కు కర్మాగారాలు ఇలా ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడం వలన పేద మధ్య తరగతి ప్రజలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని ఇవ్వాళ ద్రవ్యోల్బణం 14.2 విపరీతంగా ధరలు పెరిగిపోవడం వలన సామాన్య ప్రజలకు కనీస వేతనంతో బతకడం చాలా కష్టం కేంద్రం కరోన సమయంలో కానీ చట్టాలు తీసురావడంలో కానీ అన్ని విషయాల్లో విఫలం అయినారు.

వినాశకాలే విపరీతబుద్ధి అంటే మీకు వినాశనం మొదలు అయింది ఇప్పటికైనా మీ గౌరవం దక్కించుకోవాలంటే ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలి 2014 నుండి తెలంగాణ ప్రభుత్వం చాలా ఓపికగా కేంద్ర ప్రభుత్వం తో సత్సంబంధాలు బాగుంటే రాష్ట్రానికి మేలు జరుగుతుందని వేచి చూసాం. కానీ మీరు ప్రజా వ్యతిరేక విధానాలను చూసి ఇక ఓపికగా ఉండే పరిస్థితి లేదు నేడు అన్ని గ్రామాల్లో మండలాల్లో నిరసన కార్యక్రమాలుతెలియచేస్తున్నాం రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోకపోతే నిరసనలు మరింత ఉధృతం చేస్తాం మీరు భారీ మూల్యం చెల్లించక తప్పదు అని అన్నారు.

ఒకప్పుడు బతుకు దేరువు కోసం వ్యవసాయం పరిస్థితి నుండి నేడు స్వరాష్ట్రం సాధించుకున్నాక లాభాల బాటలో పడుతున్న రైతాంగాన్ని మరల అగాధం లోకి తోయకండన్నారు. వరితో పాటు చిరుదాన్యాలకు కేంద్రం మద్దతు ధర ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం చిరుధాన్యాలు ఉత్పత్తి చేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలు కల్పించే అవకాశముందన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి , జగిత్యాల జిల్లా జెడ్.పి వైస్ చైర్మన్ ఒద్దినేని హరిచరన్ , మేడిపల్లి, వేములవాడ రూరల్ ఎం.పి.పిలు దోనకంటి ఉమాదేవి , బూర వజ్రమ్మ , మార్కెట్ కమిటీ చైర్మన్లు గడ్డం హనుమాండ్లు , సుధవేని లతా గంగాధర్, అర్బన్ జెడ్.పి.టి.సి మ్యాకల రవి , టి.ఆర్.ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుల్కమ్ రాజు , మేడిపల్లి, వేములవాడ రూరల్, అర్బన్ పార్టీ అధ్యక్షులు సత్తిరెడ్డి , గోస్కుల రవి , ఊరడి ప్రవీణ్ , రైతు బంధు సమితి కన్వీనర్లు కటకం మల్లేశం, భూమారెడ్డి లు, పార్టీ సీనియర్ నాయకులుఏనుగు మనోహర్రెడ్డి , కౌన్సిలర్లు, సిరిగి రిరామచంద్రం, ఇప్పపూల అజయ్ ,యచమినేని శ్రీనివాసరావు ,నరాల శేఖర్, బింగి మహేష్ , కొఆప్షన్ సభ్యులు సర్వర్ బాబు న్ ,టీఆర్ఎస్ నాయకులు పేరు మహమ్మద్ టీఆర్ఎస్ నాయకులు పీర్ మహమ్మద్ ,కొండ నర్సయ్యవివిధ గ్రామాల సర్పంచులు, ఎం.పి.టి.సీలు ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com